ప్రపత్తి

# శ్రీసన్నిధానం

## ఆధ్యాత్మిక మాస పత్రిక

కరీంనగర్ సంపుటి: 01 సంచిక: 08 అక్టోబర్ 2024 పేజీలు:36 వెల:30



అత్యధిక పాఠక ఆదరణ పొందుతున్న ఆధ్యాత్మిక మాస పత్రిక



# ముఖచిత్రపరిచయం

దసరా దీపావళి ఒకే నెలలో రావడం ఆనందదాయకం. శమీ పూజ ఎప్పటినుండి మొదలైందో తెలియదు కాని అరణ్యవాసానికి వెళుతున్న రాముడికి శమీవృక్షం విశ్రాంతినిచ్చింది. త్రేతాయుగంలో ఆశ్వయుజ శుద్ధ దశమినాడు శ్రీరాముడు రావణుడితో తొమ్మిది రోజులు యుద్ధం చేసి విజయం సాధించాడని దసరా పండుగ యొక్క ప్రత్యేకతను వివరిస్తారు. దానికి ప్రతీకగా అన్ని దేవాలయాలలోనూ ఈనాడు ప్రత్యేక ఉత్సవాలు జరుపుతారు. "అర్జునస్య ధనుర్ధారీ, రామస్య ప్రియదర్శనం" అనే దానిని బట్టి ఈ ఇద్దరు మహాపురుషులకు శమీవృక్ష పూజతో సంబంధముంది. అర్జునుడు శమీ వృక్షమందు ఉంచిన ఆయుధాలను స్వీకరించినట్లుగా మహాభారతంలో తెలుస్తున్నది. చెడుపై ధర్మము సాధించిన విజయానికి ప్రతీకగా అన్ని యుగాల్లోనూ విజయదశమి పవిత్రమైన రోజుగా పెద్దలు చెబుతారు. అలాగే దీపావళి సంరంభాన్ని నరకాసుర వధతో జరుపుకుంటాం. అజ్ఞానపు చీకట్లను తొలగించే జ్ఞాన జ్యోతులు వెలిగినప్పుడే నిజమైన పండుగ. తెలంగాణలో బతుకమ్మ సంబరాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. దేశ విదేశాలకు కూడా వ్యాపించాయి. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అనే గీతాలు ప్రపంచవ్యాప్తంగా వినిపించే అవకాశం కలుగుతోంది. అన్ని పండుగల సమాహారంగా శ్రీసన్నిధానం ముఖచిత్రం దర్శనం ఇస్తోంది

# గమనిక

ప్రపత్తి శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాస పత్రికకు సలహాలు, సూచనలు, చందాదారుల చిరునామా మార్పులు, నూతన చందాదారులు కావడానికి ఇ-మెయిల్ ద్వారా తెలియజేయవచ్చును.

help desk:

prapatti.srisannidhanam9@gmail.com

మాస పత్రిక చందా వివరముల గురించి సంప్రదించవలసిన హెల్ప్ డెస్క్ నెంబర్: 9502583323

(ఉదయం 9 గం. నుండి రాత్రి 9 గం. వరకు)




**సంప్రదించండి**

**మా ఈ చిరు ప్రయత్నాన్ని స్వాగతించండి!!**

-మేనేజింగ్ ఎడిటర్

## ముఖ్య గమనిక

ప్రపత్తి శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాస పత్రిక ఈ సంచికలో ప్రచురించిన రచనలలోని భావాలు ఆయా రచయితలవే, రచన సారాంశము రచయిత అభిప్రాయముగా భావించవలెను. ఈ రచనల భావంతో సంపాదకునికి, ట్రస్టునకు ఎటువంటి బాధ్యత లేదని పాఠకులు గమనించవలసినదిగా మనవి.

- ఎడిటర్

ప్రపత్తి శ్రీసన్నిధానం
https://srisannidhanam.org
prapatti.srisannidhanam9@gmail.com

సంపుటి: 1 - సంచిక: 8 ఎడిటర్ : డింగిరి శ్రీనివాసమూర్తి అక్టోబర్ 2024 వెల : 30

## ఇందులో

4. సంపాదకీయం
శ్రీమాన్ శ్రీ వొద్దిపర్తి రామచంద్రమూర్తి
6. శ్రీరామానుజ సుధామాధురి శ్రీమతి సముద్రాల శారద
8. శ్రీపతిస్తుతి
శ్రీమాన్ శ్రీ అమరవాది వేంకటనర్సింహాచార్యులు
9. శుభాశుభ నిర్ణయాలు-మీమాంస
శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల
సంపత్కుమార కృష్ణమాచార్య, సిద్ధాంతి
10.దాశరథి శతకము
శ్రీమాన్ శ్రీ గుదిమెళ్ళ మురళీకృష్ణమాచార్యులు
12.భాగవతంలో భగవంతుని కథలు
శ్రీమతి తిరుమల నీరజ
13.కీర్తి మూర్తులు
14.తెలుసుకోవలసినవి మూడే
శ్రీమాన్ శ్రీ వంగల వెంకటాచార్యులు
16.గీతామృతం
శ్రీమాన్ ఆచి వేంకట పాండురంగాచార్య
18.నవరాత్రి వైశిష్ట్యము (ప్రత్యేకం)
శ్రీమాన్ శ్రీ కె.ఇ.స్థలశాయి
20.జ్యోతిర్విజ్ఞానమ్
శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక
21.ధృవోపాఖ్యానం
శ్రీమతి మహాలక్ష్మీ రాణి గుండు
22.వరాహావతార ప్రయోజనం
శ్రీమాన్ శ్రీ కలకుంట్ల వరప్రసాదాచార్యులు
24.అష్టలక్ష్మీ వైభవం
శ్రీమతి వంగల రాధిక
25.శ్రీరామాయణంలో ఉపకథలు
శ్రీమతి చక్రవర్తుల చూడామణి
26. జీవుడు కర్మను స్వతంత్రుడై చేస్తాడా?
శ్రీమాన్ శ్రీ శ్రీభాష్యం శ్రీనివాసాచార్యులు
29. ఋషి వాక్య ప్రబోధాలు
శ్రీమాన్ శ్రీ డా.యం.టి.ఆళ్వార్ స్వామి
31.ఉద్యోగం సద్యోగం
శ్రీమాన్ శ్రీ కవి కృష్ణమాచార్యులు

నెలవారిపంచాంగం, మనదేవాలయాలు, పుస్తక పరిచయం, బాలవిజ్ఞానం, శ్రీసన్నిధిపదకేళి

**సంపాదక మండలి**
వొద్దిపర్తి రామచంద్రమూర్తి చీఫ్ ఎడిటర్
సముద్రాల శారద వొపీనియన్ ఎడిటర్
డింగిరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్

**గౌరవ సంపాదకులు**
శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక
శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి ఆచార్య
శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనర్సింహాచార్యులు

నోట్:- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు 'శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ' అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

## సంపాదకీయం

# శ్రీవైష్ణవానికి నిలువెత్తు నిదర్శనం డింగరి లక్ష్మీనారాయణాచార్యులు



భగవత్ భక్తులు భాగవతోత్తములు మనతో కలిసి ఉన్నా, గుర్తించలేము. కాలగమనంలో వారి విలువ తెలిసే నాటికి సమయం చేదాటి పోతుంది. అలాగే శ్రీమాన్ డింగరి లక్ష్మీ నారాయణాచార్యులు అసలు సిసలైన శ్రీవైష్ణవులు. మన కర్మానుసారంగా అన్నీ పనులు మనతో భగవంతుడు చేయిస్తున్నాడని ప్రగాఢంగా నమ్మిన వ్యక్తి. పంచాంగ సిద్ధాంతిగా జ్యోతిష్యాన్ని చెప్పినా తన విశ్వాసాలను ఎప్పుడూ కూడా విడనాడలేదు. మా అక్కయ్య భర్తగా, బావగారిగా నా బాల్యం నుంచి వారిని దగ్గరగా చూసిన వాడిని, వాటిని ఇప్పుడు మననం చేసుకుంటూ... వారు భవిష్యత్ దర్శనాన్ని చేసారన్న విషయాన్ని గమనించలేకపోయాను. ప్రపన్నులు ఎప్పుడూ నిరాడంబరులే! రాజకీయాలలో ఉన్నన్ని నాళ్లు గ్రామక్షేమం, ఎదుటివారి కష్టాలను గమనిస్తూ చేదోడుగా ఉండేవారు. చిరునవ్వుతో అందరినీ అర్థం చేసుకుని వెళ్ళేవారు. ఒకమారు తాను పక్కకు పెట్టిన విషయాల జోలికి వెళ్ళేవారు కాదు. తాను ఇచ్చిన భూములు అయినా, వస్తువులు అయినా అంతే! గ్రామం కోసం తన సొంతస్థలాన్ని, కూడా ఇయ్యడం జరిగింది. నేడు గ్రామం నడిబొడ్డున కార్యాలయాలను నాడే తీర్చిదిద్దారు. అవి నేటికి ఆధునీకరించ బడినాయి. ఆతర్వాత నాటకాల వైపు, కళల వైపు కొన్నాళ్లు మొగ్గుచూపినా ఆధ్యాత్మికత భావనలు కనిపించేవి. శ్రీవేంకటేశ్వరస్వామి వైభవం కనిపించేది. వారు చిత్రించిన శ్రీవేంకటేశ్వర స్వామి హస్తకళా చిత్రం ఇప్పటికీ నామదిలో మెదలుతూనే ఉంది. అలా వారి మదిలో చేరిన శ్రీవారు ఆలయాన్ని నిర్మింపజేసుకున్నారు. ఆలయ నిర్మాణ సమయంలో శ్రీశ్రీశ్రీ చిన్నజీయ్యరు స్వామిని ఆశ్రయించారు. వారి కనుసన్నలలో మెదిలారు. పూర్వాశ్రమంలో ఎప్పుడూ తెల్ల దుస్తులు ధరించినా, ఆతర్వాత క్రమంగా ధోవతి కండువాకే పరిమితం అయ్యారు. 1984 సమయంలో ప్రతిష్ఠామహూత్సవానికి విచ్చేసిన శ్రీశ్రీశ్రీ చిన్న జీయరు స్వామివారికి తమ ఇంటినే బసగా చేశారు. తన వెన్నంటి ఉన్నవారినే కార్యకర్తలుగా, జీయర్‌శిష్యులుగా సంప్రదాయపరంగా చేయించి ఊర్ధ్వపుండ్రాలు ధరింపజేసి జీయర్‌స్వామి వారి ప్రేమకు పాత్రులను చేశారు. అప్పుడు అంతా శ్రీవైష్ణవులే సుమా అనేలా ప్రతిష్ఠోత్సవం ఆచార్య కైంకర్య నిష్ఠతో వైభవంగా నిర్వహింపజేశారు. ఆచార్యుల ప్రతి మాటను ఆదేశంగా స్వీకరించి ఆచరించిచేసి చూపారు. తాను సేకరించిన, పిత్రార్జితంగా లభించిన గ్రంథాలను జెట్‌కు వినమ్రతతో సమర్పించుకున్నారు. అంతేకాదు ప్రతిష్ఠా మహూత్సవం తరువాత ఆలయానికి ఎవరు అర్చకులు అన్న ప్రశ్న ఉదయించిన సమయంలో ఆచార్యుల మాట కాదనలేదు. అర్చకులుగా శ్రీవారి సేవలో సుమారు 18 సంవత్సరాలు తరించారు. ఆలయానికి చక్కని వ్యవస్థను తీర్చిదిద్దారు. ధనుర్మాసోత్సవాలు నిర్వహింపజేసి గ్రామస్థులను భక్తిమార్గంలో నడిపించారు. పిన్నలూ పెద్దలూ నిత్యం దివ్యప్రబంధాన్ని గానం చేసేలాకంఠస్థం చేయించారు. ఆలయంలో సాయంకాలవేళ భక్తులచే శ్రీవిష్ణుసహస్రనామ పారాయణం చేయించి తరింప జేశారు. నాడే ఆధ్యాత్మిక మార్గంలో 1990లో శ్రీసన్నిధానం పత్రికను శ్రీశ్రీశ్రీ చిన్న జీయరు స్వామి వారి చేతుల మీదుగా ఆవిష్కరింపజేసి, నేటికీ తన భావాలకు, ఆదర్శాలకు అనుగుణంగా పిల్లలు నిర్వహించేలా చేశారు. ఆళ్వారులు, పరమ భాగవతోత్తములు దర్శించిన, వసించిన ప్రదేశాలు అన్నీ దివ్యదేశాలే! అలాగే శ్రీవైష్ణవానికి త్రిమూర్తులుగా చెప్పుకునే ఆచార్యత్రయం శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ స్వామి వారు, శ్రీమాన్ తె.కం. గోపాలాచార్య స్వామి వారు, శ్రీమాన్ గుడిమెళ్ళ రామానుజాచార్య స్వామివారు వచ్చి గోధూరులోని వారి గృహాన్ని మరియు గ్రామాన్ని పావనం చేశారు. అందుకేనేమో గ్రామంలో శ్రీగోదా వేంకటేశ్వరస్వామి కొలువై వచ్చి డింగరి లక్ష్మీ నారాయణాచార్యుల వారిపై కరుణా రసాన్ని ప్రసరింపజేసారు. గ్రామానికి విచ్చేసిన వారిలో శ్రీశ్రీశ్రీసంపత్ కుమార యతిరాజ రామానుజజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ దేవనాథ రామానుజ జీయర్ స్వామి వారలు కూడా ఉన్నారు. నిత్యం తెల్లని వస్త్రాలు ధరించి చిరునవ్వులు చిందించే వారే మనకు ఆదర్శం. వారి ఆశయాలే శిరోధార్యం.

-వొద్దిపర్తి రామచంద్రమూర్తి (చీఫ్ ఎడిటర్)

# నెలవారి పంచాంగమ్

**ఆశ్వయుజ మాసం 03-10-24 శుక్లపక్షంతో ప్రారంభమై 01-11-24 వరకు, 02-11-24 నుండి కార్తీక మాసం**

09-10-24 వరకు హస్త కార్తి, 10-10-2024 నుండి చిత్త కార్తి, 24-10-24 నుండి స్వాతి కార్తి,

**పండుగలు** : 02-10-24 మహాలయ అమావాస్య, బతుకమ్మ పండుగ ఆరంభం, 09-10-24 సరస్వతీ పూజ, 10-10-24 సద్దుల బతుకమ్మ, 11-10-2024 దుర్గాష్టమి 12-10-24 విజయదశమి, శమీపూజ, 13-10-24 సర్వేషాం ఏకాదశి, 17-10-24 కోజాగర పూర్ణిమ, వాల్మీకి జయంతి, 28-10-2024 సర్వేషాం ఏకాదశి, 30-10-24 నరక చతుర్దశి, 31-10-24 మంగళ హారతులు, ధనలక్ష్మీ పూజ, దీపావళి.

## మాస ఫలాలు



**మేషం:** ఈనెల మిశ్రమఫలితాలు ఇచ్చును. వ్యవహారాలందు నష్టములు, ఆర్థిక సమస్యలు. కుటుంబ తగాదాలు.



**వృషభం:** ఈ నెల ఇబ్బందులుతప్పవు. శారీరకంగా మానసికంగా సమస్య లుంటాయి. బంధుమిత్రులతో విరోధాలు, ఆరోగ్యభంగాలు, ఊహించని సంఘటనలు జరుగును.



**మిథునం:** ఈ నెల అనుకూలము. కొన్ని విషయాలలో ఉద్రేకం, కోపం, ఉండుటచే అనుకోని దుస్సంఘటనలు జరుగును. మిత్రుల సహాయ సహకారాలు లభించును. అనవసర వ్యయం చేయవలసి వచ్చును.



**కర్కాటకం:** ఈ నెల అన్నిరంగాలవారికి అన్ని విధాలుగా బాగుంటుంది. ఆరోగ్యం కుదుటపడును. ధనాదాయం సంతృప్తి, ధైర్యంగా పనులు చేయుదురు. వాహనసౌఖ్యం, కుటుంబవ్యక్తులు సహకరించెదరు.



**సింహం:** గత రెండు, మూడు నెలలుగా పడుచున్న బాధల నుండి ఉపశమనం పొందుదురు. చేయు పనిలో ఆదాయం బాగుండును. ఆరోగ్యలాభం, కుటుంబ సౌఖ్యం.



**కన్య:** ఈనెలలో కూడా ప్రథమార్ధంలో బాగుండదు. ముఖ్యసమస్యల నుండి బయటపడుదురు. సంతానం ద్వారా ఉన్న ఇబ్బందులు పరిష్కారమగును.



**తుల:** ఈ నెలలో మీమాటకు విలువ పెరుగును. పట్టుదల, ఉత్సాహం, కార్యదక్షత పెరుగును. శ్రమకు తగ్గ ఫలితం లభించును. కుటుంబంలో సఖ్యత, దైవ సంబంధ కార్యములు చేస్తారు.



**వృశ్చికం:** ఈనెలలో ప్రతీ విషయంలోనూ వ్యతిరేకత, ఆటంకాలు, ఆదాయమునకు మించిన ఖర్చులు, కుటుంబ సభ్యులతో విరోధములు, పనులు పూర్తిగాక ఇబ్బందులు.



**ధనుస్సు:** ఈ నెలలో బాగుండదు. ఆదాయమునకు మించిన ఖర్చులు. ఊహించని సమస్యలు ఎదుర్కొంటారు. కొన్నిపనులు చేయుటవల్ల ఇబ్బందులు కొని తెచ్చుకొంటారు.



**మకరం:** అన్నిరంగాల వారికి యోగమే. చేయు వృత్తి వ్యాపారములు రాణించును. ఆరోగ్యం బాగుండును ఆర్థికంగా చక్కబడును.



**కుంభం:** ఈనెలలో ప్రథమార్ధం బాగుండును. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రమే ఉంటాయి. ద్వితీయార్ధంలో పరిస్థితులు అనుకూలించును.



**మీనం:** ఈ నెలలో ప్రథమార్ధం బాగుండదు. అనేక ఈతిబాధలు సమస్యలు మనశ్శాంతి ఉండదు. ద్వితీయార్ధంలో కొంతమేర అనుకూలించును. అనుకున్న పనులు సాధించెదరు.

**మహాపర్వదినాలే శరన్నవరాత్రులు**

**ఆశ్వయుజ కృష్ణచతుర్దశి, అమావాస్య రోజున లక్ష్మీ దేవిని ఆహ్వానిస్తూ ఎవరైతే తమ ఇళ్ళలో దీపాలతో పండుగ జరుపుకొంటారో వారికి లక్ష్మీ కటాక్షం ఎల్లప్పుడు ఉంటుంది. దీపావళి నాడు తిల తైలంతో తలంటి స్నానం చేయడం లక్ష్మీప్రదం. భక్తి శ్రద్దలతో పూజించి దీపాలు వెలిగిస్తే లక్ష్మీ దేవి ప్రసన్నురాలై సంపదలను అనుగ్రహిస్తుంది అజ్ఞానంధకారాన్ని తొలగించి జ్ఞానప్రకాశాన్ని విస్తరింపజేసే పండుగ దీపావళి.**

## మంచి రోజులివిగో...

**ఈనెల వివాహ, గృహారంభ, గృహప్రవేశ శుభ ముహూర్తములు లేవు**

**08,12,17,26 బోరింగు ముహూర్తములు కలవు.**

# అనంత కీర్తి – సుగంధ మూర్తి



– శ్రీమతి సముద్రాల శారద

తన గురువైన భగవద్ రామానుజుల ఆజ్ఞతో తిరుమల చేరిన అనంతాళ్వాన్ పుష్ప వనాన్ని నిర్మించసాగారు. ఎవ్వరి సహకారం తీసుకోలేదు కానీ గర్భవతి అయిన భార్య, భర్త అడుగుజాడల్లో నడుస్తూ సహకరించేది. వారి అకుంఠిత దీక్షను లోకానికి వెల్లడించదలచి సాక్షాత్ శ్రీనివాసుడే బాలుని రూపంలో వచ్చి సహాయం చేస్తానంటే అనంతాళ్వాన్లు తిరస్కరించారు. కానీ ఆ బాలుడు ప్రీతి గొలుపే మాటలతో అతని భార్యను ఒప్పించి చాటుగా మట్టి తీయడానికి సహకరించ సాగాడు. అది తెలుసుకుని పరిగెత్తుతున్న బాలుని పైకి గునపం విసరగా అది తాకి చుబుకానికి గాయం అవుతుంది. తెల్లవారి ఆ గాయాన్ని శ్రీనివాసమూర్తి వదనంపై చూసి ఆశ్చర్యపోతారు. అప్పటినుండి భగవంతుని ఆజ్ఞతో శ్రీ వేంకటేశ్వరుని ముఖంపై చుబుకానికి, ఆ దివ్య సన్నివేశానికి గుర్తుగా కర్పూరాన్ని అలంకరిస్తున్నారు. అలాగే ఆ గడ్డపారను దేవాలయ ముఖద్వారానికి వేలాడదీశారు.

అనంతార్యుల తోట సౌందర్యానికి ముచ్చటపడి వారి భక్తికి ముగ్ధులై పద్మావతి సహితుడై శ్రీ వేంకటేశ్వర స్వామి రాత్రివేళ అక్కడ విహరించేవాడట. తెల్లవారి తోటలో తీగలు, పుష్పాలు చెదరిన గుర్తులు చూసి అనంతాళ్వాన్ మాటు వేసి వారిని పట్టుకొనుటకు ప్రయత్నించారు. పద్మావతీ దేవి మాత్రము పట్టుపడగా పొగడమానుకు ఆమెను బంధించారట. తెల్లవారి స్వామి మెడలో అమ్మవారి ప్రతిమ లేకపోవడం చూసి అర్చకులు తల్లడిల్లారు. వీరు బంధించినది అమ్మవారినే అని గుర్తించారు. ఈ సత్యం తెలిసిన అనంతాళ్వాన్ పశ్చాత్తాపంతో భక్తితో క్షీరాబ్ధి కన్యకను సాగరుడు సమర్పించినట్లుగా ఆమె బంధనం తీసి సకల లాంఛనాలతో కన్యాదానం చేసి కళ్యాణం జరిపించారు. ఇలా ఎన్నో లీలలు వాటికి గుర్తుగా ఆరాధనలు కట్టడాలు తిరుమలలో ఏర్పాటు చేయబడ్డాయి.

ఆదిశేష స్వరూపమైన దేవతా నిలయమైన తిరుమల కొండపై పాదం మోపి రావటానికి నిరాకరించిన జగదాచార్యులను ఒప్పించి కొండపైకి రప్పించి పుష్పవనాన్ని చూపించి ఆనందింపచేశారు. మోకాళ్ళతో పర్వతాన్ని ఎక్కి పుష్పమంటపంలో ప్రియ శిష్యుడైన అనంతాళ్వాన్ల శ్రద్ధకు ఎంతో సంతోషించారు. తిరిగి శ్రీరంగం వెళ్ళుటకు బయలు దేరగా ఆచార్యుల విశ్లేషమును భరించలేని అనంతాళ్వాను లకు భగవత్ రామానుజులు యతి రాజముద్రతో తన మూర్తిని తయారు చేయించి ఆలింగనము చేసుకొని కళారోపణము చేసి ఇచ్చారు. ఆ మూర్తిని భగవదాజ్ఞతో రామానుజాచార్యులు స్వామికి శంఖచక్రములు లక్ష్మీదేవిని సమర్పించిన దానికి గుర్తుగా ఆచార్య స్థానముగా ఎత్తయిన మంటపంలో సంపంగి ప్రాకారంలో ప్రతిష్ఠింపచేశారు అన్నంతాళ్వాను. అదే నేటి తిరుమల దేవాలయంలోని భాష్యకారుల సన్నిధి. సంపంగి ప్రాకార నిర్మాణంలో కూడా అనంతార్యులదే ప్రధాన పాత్ర అని చరిత్ర చెబుతున్నది. ప్రాకారమును కట్టాలని నిర్ణయించిన తర్వాత ఆ స్థలములో మధ్యలో సంపంగి వృక్షం అడ్డుగా ఉంది. దాన్ని తొలగించుటకు ఎవ్వరికి మనసు ఒప్పలేదు కానీ తొలగించక తప్పదు ఆ సమయంలో అనంతాళ్వాన్ మనోవ్యాకులతతో విచారిస్తూ ఉన్నాడు. కానీ ఆశ్చర్యంగా తెల్లవారి చూడగానే ఆ వృక్షము అడ్డుగా లేక నిర్మాణానికి వీలుగా ప్రక్కకు జరిగి ఉన్నదట! ఆశ్చర్యం! ఈ అద్భుత సన్నివేశానికి గుర్తుగా ఆ ప్రాకారానికి సంపంగి ప్రాకారం అని పేరు పెట్టారట! అనంతాళ్వాన్‌కు వృక్షములంటే పువ్వులు అంటే ఎంతో ప్రీతి. మరియు ఆచార్యులైన భగవద్ రామానుజులు తిరుమల గురించి చెప్పిన ఉపదేశములు హృదయస్థమై ఉన్నవి. తిరుమలలో ప్రతి చెట్టు పుట్ట క్రిమి కీటకం సర్వజీవులు స్వామి సన్నిధిలో సేవకై వచ్చిన దేవతా స్వరూపాలే అని వారి

# శ్రీరామానుజ సుధామాధురి



అభిప్రాయం. అందుకే ఒకసారి శిష్యులతో కంచికి ప్రయాణమైనప్పుడు కొంత ఆహారాన్ని మూటగట్టుకొని వెళ్తున్నారు. దారిలో తినడానికి సిద్ధమై మూట విప్పగా అందులో ఆహార పదార్థంతో పాటు అనేక కొండచీమలు కనిపించాయి. వెంటనే చింతించి శిష్యులతో తిరుగు ప్రయాణమై ఆ కొండచీమలను మళ్లీ తిరుమల కొండపైన వదిలివేశారట! వారి భగవద్భక్తి, ఆచార్య నిష్ఠ, ప్రకృతిపై ప్రేమ, భూతదయ ఎంతో గొప్పవి.

భగవద్ రామానుజాచార్యులు పరమపదానికి వేంచేసిన తర్వాత ఆవియోగంతో దుఃఖిస్తున్న అనంతార్యులకు ఆచార్యులపై గల భక్తికి గుర్తుగా శ్రీనివాసుని ఆజ్ఞతో కొన్ని ఆరాధన వ్యవస్థలు ఏర్పాటు చేశారట! అధ్యయనోత్సవ దినములలో జగదాచార్యుల వైభవాన్ని తెలిపే ప్రపన్న గాయత్రి 108 పాశురములు గానము చేయుట ఏర్పాటు చేయబడ్డది. భాష్యకారుల సన్నిధిలో రామానుజ పాదముద్ర లతో శఠగోపమును ప్రతిష్ఠించి పాదముద్రల కింద తన శిరము ఉన్నట్లుగా భావించి

"శ్రీమద్రామానుజాచార్య శ్రీపదాంబోరుహ ద్వయం
సదుత్తమాంగ సంధార్యం అనంతార్య మహం భజే" అని తనియను ప్రసిద్ధము గావించారు. భగవత్ రామానుజాచార్యుల వలె వారి హృదయము కూడా ఎంతో సున్నితమైనది. ఒకనాడు పుష్కరిణి తీరంలో గతించిన పులిని చూసి భగవంతుని ప్రార్థించి మోక్షాన్ని ఇప్పించుట, సర్వప్రాణుల్లోను చెట్టు చేమల్లోను భగవంతుని దర్శించుట. ఇలా అనేక సన్నివేశముల ద్వారా వారి సున్నిత హృదయం వెల్లడి అవుతున్నది. పాము కరిచినా విష జ్వరము సోకినా అనంతాళ్వానుల దైవభక్తి అకుంఠిత దీక్ష ధైర్యమే వారిని కాపాడాయి.

"ప్రోక్తం స్వస్యచ కీర్తనం ప్రపదనం స్వస్మై ప్రసూనార్పణం" అని భగవన్ నామ కీర్తనము, శరణాగతి, పుష్పార్చనము, సమర్పిస్తూ భాగవతారాధన విధాన్ని మానవులకు తెలియపరిచి తరింపచేయుటకే ఆండాళ్‌తల్లి అవతరించిందని గొప్ప ఆరాధనా రహస్యాన్ని తెలియపరిచిన ప్రసిద్ధ స్తోత్రం గోదా చతుశ్లోకి వీరు రచించారు. మరియు రామానుజ చతుశ్లోకి, వెంకటేశ ఇతిహాసమాల, మధురకవి దివ్య సూరి ప్రబంధము వీరి రచనలు. తిరుమలలో పఠించే ప్రసిద్ధమైన లక్ష్మీగద్యము, శ్రీశ్రీనివాసగద్యము వీరి వంశస్థులే రచించారు.

కూరేశుల కుమారులు పూర్వాచార్యులు శ్రీపరాశభట్టర్ తరచూ వీరిని కలిసేవారు. ఒకసారి శ్రీవైష్ణవ లక్షణాలు తెలియ గోరిన ఒక వైష్ణవ స్వామిని అనంతాళ్వాన్ వద్దకు పంపించారు. (ఈ కథ సాంప్రదాయంలో చాలా ప్రసిద్ధి పొందింది) అనంతాళ్వాన్ వారిని ఆదరించారు కానీ ఒకరోజు భోజనమునకు కూర్చునే సమయంలో వారిని మరొక పంక్తికి రమ్మని రెండుసార్లు పంపించారు. ఆ వైష్ణవ స్వామి సహనంతో వేచి చివరి పంక్తిలో భోజనం చేశారు. అయితే శ్రీవైష్ణవ లక్షణాలు తెలుపమని అనంతార్యులను కోరాడు. దానికి వారు కొంగ వలె, కోడి వలె, ఉప్పువలె, నీ వలె ఉండడమే శ్రీవైష్ణవ లక్షణం అని చెప్పి పంపించారు. పరాశర భట్టర్ వద్దకు వెళ్లి వారి ద్వారా విషయాన్ని గ్రహించారు. ఆ అర్థాన్ని పరాశర భట్టరు వారు వివరించారు. కొంగ ఎన్ని చేపలు తన చేతికి చిక్కినను ఒక పెద్ద చేప చిక్కినప్పుడే దానిని పట్టుకున్నట్లు గొప్ప అవకాశం కొరకు వేచిచూడాలి. కోడి ఎన్ని చోట్ల తిరిగినను తనకు (మిగతా 17 వ పేజీలో)

# శ్రీపతి స్తుతి - సుభాషితం

మంచి మాట

## గజేంద్ర మోక్ష విషయమైన శ్లోకత్రయము


1.శ్లో॥ ప్రాతస్స్మరామి భవ భీతి మహార్తి శాంత్యై
నారాయణం గరుడవాహన మంజనాభం।
గ్రాహాభి భూత మద వారణ ముక్తి హేతుం
చక్రాయుధం తరుణ వారిజ పత్ర నేత్రమ్॥

ప్రతిపదార్థం:- అంజనం+ఆభం = కాటుక వంటి నల్లనైన కాంతి గలిగిన, గ్రాహ = మొసలి చేత, అభిభూత = తిరస్కరింప బడిన, (బాధింప బడిన) మద వారణ = మద గజమునకు, ముక్తిహేతుం = మోక్షమునకు కారణమైన వాడును, చక్రాయుధం = చక్రాయుధమును ధరించిన వాడును. తరుణ వారిజ = అప్పుడే వికసించిన తామర పుష్పము యొక్క, పత్ర= రేకులవంటి, నేత్రం = కన్నులు గలవాడు. గరుడ వాహనం = గరుత్మంతుడు వాహనంగా గలవాడును అగు, నారాయణం = శ్రీమన్నారాయణుని, భవభీతి = సంసార భీతి అనే, మహా + ఆర్తి = గొప్పనైన ఉపద్రవము యొక్క, శాంత్యై = ప్రభావమును తొలగించి రక్షించుట కొఱకై, ప్రాతః = వేకువ సమయమున, స్మరామి = ధ్యానించు చున్నాను.

తాత్పర్యము:- అందరు గూడా తెల్లవారు సమయంలో ప్రతి నిత్యము శ్రీమన్నారాయణుని ధ్యానించుకోవాలి. జననము, మరణము అనే ఈ సంసారము అత్యంత దుఃఖ దాయకమైనది. ఇది తొలగిపోయి ఎప్పుడూ ఆనందమునే కలిగించు పరమపదంలో స్వామికి స్వరూపానురూపమైన సర్వవిధ సేవచేసి సుఖించి మోక్షము కావాలని కోరుకోవాలి. శరణాగతి చెయ్యాలి. తప్పక మనలను కాపాడుతాడు. మొసలి బారి నుండి గజేంద్రుని రక్షించిన వాడు. చక్రా యుధమును చేత ధరించిన వాడు. అప్పుడే వికసించి పరిమళమును, ఆహ్లాదమును కలిగించే తామరపుష్పము యొక్క రేకులవలె ప్రకాశించే కన్నులు గలవాడు. కాటుక వలె నల్లని శరీరకాంతి గలవాడు నారాయణుడు. ఆయనను ఎల్లప్పుడు ధ్యానించు చుండవలెను.

2.శ్లో॥ ప్రాతర్నమామి మనసా వపుషా చ మూర్ధ్నా
పాదారవింద యుగళం పరమస్య పుంసః।
నారాయణస్య నరకార్ణవ తారణస్య
పారాయణ ప్రవణ విప్ర పరాయణస్య॥

ప్రతిపదార్థము :- నరక = నరక మనే, మహా = గొప్పనైన, అర్ణవ = సముద్రమును, తారణస్య = దాటించు నట్టి, పారాయణ = భగవత్



**శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనరసింహాచార్యులు**

వైభవములు తెలుపు వేదాది ప్రబంధములను పారాయణము చేయుట యందు, ప్రవణ = ఆసక్తులై ప్రతినిత్యము విడువక ఉన్న, విప్ర = భక్తుల విషయంలో, పరాయణస్య = ఆదరాతిశయమును గలిగియున్న, పరమస్య పుంసః = ఉత్తమ పురుషుడని శాస్త్రములలో ప్రసిద్ధి చెందియున్న, నారాయణస్య = శ్రీమన్నారాయణుని యొక్క, పాదారవింద యుగళం = పద్మముల వంటి పాదముల జంటను, మనసా = మనస్సుచే ధ్యానించుచు, వపుషా = శరీరముతోను, మూర్ధ్నా చ = శిరస్సుతోను, ప్రాతః = తెల్లవారు సమయమున, నమామి = నమస్కరించుచున్నాను

తాత్పర్యము:- మనము చేసిన పాపముల ఫలితమును అనుభవింప జేయుటకు యమలోకంలో అనేకములైన నరకములున్నవి. నరకలోకము అది మహా సముద్రము వంటిది. దానిని దాటాలి అంటే పరమాత్మను శరణాగతి చేయుటయే. అట్టి పరమాత్మకు వేదాది ప్రబంధములను ప్రతి నిత్యం విడువకుండ పారాయణం చేసే భక్తులను కాపాడటంలో ప్రత్యేకశ్రద్ధ గలదు. అట్టి నారాయణుని పాద ద్వయమును ప్రాతః కాలంలో నమస్కరించవలెను. ఆ నమస్కారము మనస్సులో ధ్యానం చేస్తూ, శరీరంతో శిరస్సు తో అనడంలో సాష్టాంగముగా అనిభావము.

శరణాగతి రక్షణమే పరమాత్మకు ఇష్టమైనది కాబట్టి మనం వేకువనే సాష్టాంగ నమస్కారం చేయవలెను.

(మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో)

# శుభాశుభ నిర్ణయాలు-మీమాంస

(క్రిందటి సంచిక తరువాయి)

శ్లో॥ అకచటతప యశ హపయాః పూర్వాది మధ్యాన్తాః।
శల్య కరా ఇహనాన్యే శల్య గృహే నివసతాం నాశః॥

తూర్పు పడమరలుగా నాల్గు గీతలు, ఉత్తర దక్షిణములుగా నాల్గు గీతలు గీసిన తొమ్మిది గడులు గల చక్రమేర్పడును. ఈ చక్రమున తూర్పు మొదలు ప్రదక్షిణ క్రమముగా ఎనిమిది దిక్కుల యందు అ క చ ట త ప య శ అను అక్షరములను మధ్యలో హపయ అను మూడక్షరములను వ్రాసి యుంచ వలయును. ఈ అక్షరములే శల్యకరములనియు, శల్యములున్న గృహము నివాస యోగ్యము కాదు. ఒకవేళ శల్యములున్న గృహమందు నివసించిన నాశము కలుగును.

తూర్పు

| | | | | |
|---|---|---|---|---|
| | శ | అ | క | |
| ఉత్తరం | య | హపయ | చ | దక్షిణ |
| | ప | త | ట | |

పడమర

పృచ్ఛకుని ప్రశ్నాద్యక్షరము అకారమైన తూర్పు, కకారమైన, ఆగ్నేయము, చకారమైన దక్షిణము, టకారమైన నైఋతి, తకారమైన పడమర, పకారమైన వాయవ్యం, యకారమైన, ఉత్తరము, శకారమైన ఈశాన్య దిశలలో శల్యములున్నవని నిశ్చయింప వలయును. హ.ప.య అక్షరములు ఐన మధ్యభాగమని నిర్ణయించవలయును.

శ్లో॥ పృచ్ఛాయాం యది అః ప్రాచ్యాం నరశల్యం తదాభవేత్
సా2ర్థ హస్త ప్రమాణేన తచ్చ మానుష మృత్యు కృత్

తా: పృచ్ఛకుని ప్రశ్న అక్షరము అకారమైన ఒకటిన్నర హస్తము ప్రమాణము లోతులో మనిషి ఎముక యున్నదని అది మరణమును గలిగించునని తెలియ వలయును.

శ్లో॥ ఆగ్నేయాం యది కః ప్రశ్న శశ శల్యం కరద్వయే।
రాజదండో భవేత్తత్ర భయం నైవ వివర్తతే॥

తా: ప్రశ్న అక్షరము కకారమైన ఆగ్నేయ భాగములో రెండు హస్తముల లోతులో కుందేలు ఎముక యున్నదని గుర్తించవలయును. యిది రాజదండన భయమును గలిగించును.

శ్లో॥ యామ్యాం దిశిచ చః ప్రశ్నే కుర్యా దాకటి సంస్థితం।
నరశల్యం గృహే శస్య మరణం చిర రోగతః॥

తా: ప్రశ్న అక్షరము చకార మయినచో దక్షిణ దిశ యందు కటి ప్రమాణము లోతులో మనుష్య శల్యము లుండును. యిందు నివసించిన యజమానికి దీర్ఘరోగము మరణము సంభవించును.



## శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి

శ్లో॥ నైఋత్యాం యదిటః ప్రశ్నే సా2ర్థ హస్తా దధఃస్థలే॥
శునో2స్థి జాయతే తచ్చ బాలానాం జన యే స్మృతిం॥

ప్రశ్న అక్షరము టకారమయిన నైఋతి దిశలో ఒకటిన్నర హస్తము లోతుపైగా కుక్క ఎముక లుండును. యిందు నివసించిన సంతాన నష్టము కల్గును.

శ్లో॥ వాయవ్యాం యదిపః ప్రశ్నే తుషాంగారౌ చతుష్కరే।
కుర్వన్తి మిత్రునాశంచ దుఃస్వప్న దర్శనం తథా॥

ప్రశ్న అక్షరము పకారమయిన వాయవ్య దిశయందు నాల్గు హస్తముల లోతులో ఊక బొగ్గులు యుండును. యిందు నివసించిన మిత్ర నాశనము, దుఃస్వప్నములను కలిగించును.

శ్లో॥ ఉదీచ్యాం యదియః ప్రశ్నే తదా శల్యం కటేరధః॥
తద్ధనం నిరసత్వాయ కుభేర సదృశస్యహి॥

తాత్పర్యము: ప్రశ్న అక్షరము యకారమయిన ఉత్తరదిశలో కటి ప్రమాణము లోతులో శల్యములుండును. యిందు నివసించిన కుభేరుడంత ధనవంతుడైనను దరిద్రుడగును.

శ్లో॥ ఐశాన్యాం యదిశః ప్రశ్నే గోశల్యం సార్థహస్తః॥
తద్గోధనానాం నాశాయ జాయతే గృహమేదినః


తా: ప్రశ్న అక్షరము శకారమైన ఈశాన్య దిశయందు ఒకటిన్నర హస్తము లోతులో ఆవు ఎముకలున్న వనియు యందు నివసించిన పశువులకు ధనమునకు నష్టము గలుగును.

(మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో)



# దాశరథి శతకము

## ('భద్రవేది' వ్యాఖ్యానసన్నుతి)



**శ్రీమాన్ శ్రీ గుదిమెళ్ళ మురళీకృష్ణమాచార్యులు**

**1. పద్యప్రసూనము**

శ్రీరఘురామ! చారుతులసీ దళదామ! శమక్షమాది శృం
గార గుణాభిరామ త్రి జగన్నుత శౌర్యరమా లలామ దుర్
వార కబంధ రాక్షస విరామ! జగజ్జన కల్మషార్ణవో
త్తారక నామ! భద్రగిరి దాశరథీ! కరుణా పయోనిధీ

**భావపరిమళము**

శ్రీయుతమైన రఘువంశమునందు అవతరించిన రామా! నీవు మనోజ్ఞమైన తులసీ దళములచే కూర్చబడిన మాలికను ధరించినవాడవు. శాంతము, సహనము మున్నగు కళ్యాణ గుణములచే ఆశ్రయణ సులభుడవు. స్వర్గ మర్త్య పాతాళములను మూడులోకముల యందును కీర్తించబడిన పరాక్రమ శ్రీచే అలంకృతుడవు. ఎదిరింప శక్యముగాని కబంధుడనే రాక్షసుని వధించినవాడవు. లోకములోని వారందరి పాపములనే సముద్రమును దాటించ గలిగిన తారక నామము కలిగినవాడవు. శ్రీభద్రాచల దివ్యక్షేత్రము నందు వేంచేసి యున్న ఓ దాశరథి రామా! నీవు కరుణా పయోనిధివి.



**భద్రవేది**

ఇది భక్త రామదాసుగారు భద్రాద్రి రాముని పవిత్రోరుపదాబ్జముల యందు సమర్పించిన మొదటి పద్యప్రసూనము.

"వికసితోత్పల, చంపక వృత్త మాధురీపూరిత వాక్ప్ర సూనముల పూజలొనర్చెదను" అంటూ సంకల్పించుకున్న శ్రీరామదాసుగారు, ముందుగా ఉత్పలవృత్త ప్రసూనమును సమర్పించుచున్నారు. ఇది శబ్దార్థ వికసితము, తత్వార్థ మాధురీ పూరితము.

భగవద్విషయజ్ఞాన పూర్ణులైన శ్రీరామదాసుగారు, భద్రాద్రి రాముని శ్రీచరణార్చనకు పూనుకున్నారు. ఇది పద్య ప్రసూనశతకారాధన.

ఏవిధంగా అయితే మంత్రారాధనకు ఓంకారము శుభారంభమో అదే విధంగా పద్యారాధనములో శ్రీకారము శుభారంభము. మన రామదాసుగారికి ఇంచుమించుగా సమకాలికులైన కాకునూరి అప్పకవి "వేదములకెల్ల నోంకార మాదియైన కరణి కృతులకెల్ల శ్రీకారమాది గాన కవి వరులెల్లరు దాని తక్క నితర వర్ణంబులిడరు సత్కృతుల మొదల" అని తమ లక్షణ గ్రంథములోన పేర్కొనుట ఇక్కడ స్మరణీయము. తెలుగు సాహిత్యంలో ఆదికవిగా ప్రసిద్ధిని పొందిన నన్నయ భట్టుగారు, తమ మహాభారతాను వాదాన్ని 'శ్రీ వాణీ గిరిజాశ్చిరాయ' అని శుభారంభించారు. తిక్కన సోమయాజి గారు కూడా 'శ్రీయన గౌరి నాబరగు' అంటూ అదే పద్ధతిని అనుసరించారు. తెలుగు చదువుల పూదోటలో

'మందార మకరంద మాధుర్యాల' భాగవతాన్ని వెలయించిన మన పోతన గారు కూడా 'శ్రీకైవల్యపదమ్ము' అంటూ శ్రీకారాన్ని చుట్టారు.

మన రామదాసుగారు కూడా 'శ్రీ రఘురామ!' అని ఈ శతకానికి శ్రీకారం చుట్టి ఈ సత్కృతిని రామ నామాంకితం గావిస్తున్నారు. ఓంకార, శ్రీకారములు రెండూ కూడ లక్ష్మీనారాయణ స్వరూపములు.

వేదములన్నిటి సారతమమైన స్వరూపము ఓంకారము కాగా! వేదములన్నీ శ్రీకార స్వరూపములే!

"ఋచ స్సామాని యజూగ్ంషి సా హి శ్రీః అమృతా సతామ్" అనే మాత్రభాగము పైవిషయమును ప్రమాణ రూపముగా చెప్పుచున్నది. ఈ విధముగా వేదము ఉకారముగాను, వేద వేద్యుడైన శ్రీపతి ఓంకారముగాను మాంగళాధి దేవతలై విలసిల్లు చున్నారు. అలా వేదములకు ఓంకారము, వేదోపబృంహణములైన కావ్యాదులకు శ్రీకారము మాంగళాదిగా సంభావించబడుచున్నవి.

"వేదత్తుక్కు ఓమెన్ను మదుపోల్ ఉళ్ళదుక్కెల్లామ్ శురుక్కాయ్ తాన్ మంగళ మాదలాల్" అని విశదవాక్ శిఖామణి అయిన శ్రీమణవాళమామునుల శ్రీసూక్తి, ప్రపన్న జన కూటస్థులగు శ్రీమన్నమ్మాళ్వారుల తిరువాయ్ మొళి ప్రబంధారంభమును 'ఉయర్వఱ' అని ఓంకారముతోనే ఆరంభించుట స్మరణీయము. ఆ ప్రబంధము సామవేద సారస్వరూపము కదా!! అందువలననే లక్షణకారులు 'శుభవర్ణాః శుభశబ్దాః యేచ శుభగణాః త ఏవ కావ్యాదౌ గ్రాహ్యాః' అని నిర్దేశించినారు. ఆ నియమనమును అనుసరించి శుభ వర్ణాదులలో సర్వశ్రేష్ఠ తమమైన శ్రీకారమును ప్రయోగించుట శిష్టవ్యవహార సిద్ధమై యున్నది.

"శుభదేవతా త్రయంబును
శుభ ఖేచర త్రయము కలిగి శుభవాచకమై
అభిమతి గాంచినకతమున
శుభములు శ్రీకారమునను జొప్పడు టరుదే"

అని అప్పకవీయ వివరణము.

శకార రకార ఈ కారముల త్రివర్గ సంగమమే శ్రీకారం! శ్రీకారములోని ఈమూడు వర్ణములకు ముగ్గురు శుభదేవతలు అధిపతులు. శకారమునకు మంగళానాంచమంగళమ్ అని, శ్రీమహాభారతమున కీర్తించబడిన శ్రీహరియే దేవత. రకారమునకు జాత వేదునిగా వేదములచే స్తుతించ బడిన అగ్నిహోత్రుడే అధిదేవత. ఎవడు వేదముల యందు తెలియ బడునో, ఎవని ద్వారకముగా వేదములు ఫలప్రదములై జన్మించుచున్నవో, ఎవని సముఖముగా వేదోక్త కర్మములన్నీ వేద వేద్యుడైన పరమాత్మకు సమర్పించ బడుచున్నవో అతనికి జాతవేదుడు (అగ్ని) అని పేరు. అతడే ఈ వర్ణమునకు దేవత. ఈకారమునకు సాక్షాత్ మంగళ దేవత అయిన శ్రీమహాలక్ష్మియే అధిదేవత. 'తాం పద్మినీం ఈం శరణమహం ప్రపద్యే' అని ఋగ్వేదమునకు చెందిన శ్రీసూక్తము. అమ్మ వారిని ఈకార స్వరూపిణిగా కీర్తించినది. ఆ శ్రీదేవియే 'ఈ' దేవత.

పై లక్షణ పద్యములోని శుభదేవతాత్రయము ఇదియే. శుభ ఖేచరత్రయము అనగా శుభగ్రహములు మూడు అని అర్థం. లెక్కకు మూడు అన్నప్పటికీ ఇద్దరే ఈ వర్ణ త్రయమునకు ప్రత్యధిదేవతలు. వారు శుభగ్రహములైన గురుశుక్రులే, శకార, ఈకారములకు భార్గవుడైన శుక్రుడు కాగా, మధ్య రకారమునకు గురుడు ప్రత్యధిదేవత. దేవతా పరముగా శకార ఈకారములకు భార్గవి అయిన శ్రీమహాలక్ష్మీ సంబంధ మున్నట్లే గ్రహపరముగా శకార ఈకారములకు భార్గవుడైన శుక్రుని సంబంధము గమనార్హము. రకారమునకు చెందిన అగ్ని, గురువు లిరువురు జ్ఞాన, తేజస్సులకు సంకేతము కావడంతో శ్రీకారము జ్ఞానతేజోవాచకమై మంగళ ప్రదమగుచున్నది. అర్థాత్ శకారము మంగళమునకు, రకారము జ్ఞాన దీపమునకు, ఈకారము సర్వజనాభి ముఖ్యమునకు సంకేతములై యున్నవి.

కిం బహునా? మంగళ దీపారాధనమే శ్రీకారప్రయోగము. "అగ్నిం దూతం వృణీమహే హోతారం విశ్వవేదసమ్ అస్య యజ్ఞస్య సుక్రతుమ్" అని శ్రుతి. భగవదారాధనాత్మకమైన ఏ యజ్ఞాన్ని, ఏకార్యాన్ని నిర్వహించవలెనన్నా యజ్ఞ ప్రధానుడు, యజ్ఞ తత్త్వమును తెలిసినవాడూ అయిన అగ్ని హోత్రుని దూతగా వరించవలెను. ఆరాధ్యుడైన భగవంతునికి, ఆరాధకులమైన మనకు మధ్య సమన్వయ సారధి లాంటి వాడు ఆయన, 'అగ్రం నయతీతి అగ్నిః' మనలను ఆ ఆరాధన కార్యమున ముమ్ముందుకు తీసుకుని వెళ్ళే దైవ విశేషమునకు అగ్ని అని పేరు. 'అగ్నిముఖా వై దేవాః' అగ్ని పురస్సరముగానే దేవతలనైనా, దేవరాజయిన దేవేంద్రుని అయినా, దేవ దేవుడైన భగవంతుని అయినా ఆరాధించవలెను అదే వైదిక విధానం. సనాతనధర్మీయుల మైన మన మందరము ఏకార్యమును అయినా దీపమును వెలిగించిన పిమ్మటనే ఆరంభించుట ఆచరించుట అనేది...ఆ వైదిక విధానమును అనుసరించుటయే! ఇలా చేయడాన్ని మనం జ్యోతిః ప్రజ్వలనం అనో, దీపారోపణము అనో, దీపావిష్కారము అనో వివిధములైన పేర్లతో వ్యవహరించు చున్నప్పటికీ దీనికి "దీపారాధన" మనేదే సముచితమైన పేరు. వైదిక భావసమంచితమైన తీరు. ఏతావతా భద్రాద్రి రాముని తమ పద్య ప్రసూనములతో ఆరాధించుటకు ముందుగా మన రామదాసుగారు శ్రీకార దీపారాధనను ఆచరించినారన్న మాట.

"శ్రీరితి లక్ష్మాః ప్రథమాభిధానమ్" (మిగతా 17 వ పేజీలో)

# భాగవతంలో భగవంతుని అవతార గాథలు

(క్రిందటి సంచిక తరువాయి)

## సనకసనందనాదుల అవతారాలు

ఒకప్పుడు రుద్రుడు, సనత్కుమారమహర్షిని సందర్శించాడు. సనత్కుమారుడు ఆయనను ఉచితరీతిని గౌరవించి, "ఓ త్రిలోచనా! మరణమోచనా! కనికరించి నాకు దర్శన మిచ్చావు. నీవు విచ్చేసిన కార్య మేదో చెప్పు. చేస్తాను" అన్నాడు.

అందరూ అర్చించే ఆ సనత్కుమారునితో పరమేశ్వరుడు, "సోదరా! నీతో గోష్ఠి చేయాలని వచ్చాను. ధ్యానంలో దర్శించదగింది ఏది? తత్త్వాలు ఎన్ని? సాంఖ్యం అంటే ఏమిటి? వీటితో పాటు ఇతర ఆధ్యాత్మికవిషయాలు కూడా నీ నుంచి వినగోరుతున్నాను" అన్నాడు.

సనత్కుమారుడు ఆనందించి, "తత్త్వాలు ఇరవై నాలుగు, ఇరవై మూడు, ఇరవై ఐదు – ఇట్లా రకరకాలుగా చెబుతారు. ఇరవై మూడు అనేవారు ప్రాకృతులు. వారు మనస్సు, బుద్ధి ఒకటే అంటారు. ఇరవై నాలుగనే వారు మనసూ, బుద్ధీ వేర్వేరు అంటారు. నేను ఇరవై ఐదు అంటాను. భూతాలు ఐదు. వాటి గుణాలు పది. ఐదు ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి, అహంకారం, ప్రకృతి. ఈ ఇరవై నాలుగిటినీ మించిన తత్త్వాన్ని చెబుతాను, విను. దేహం అనే మార్గంలో బుధుడు ఊహిస్తాడు. కాష్ఠంలో ఉన్న అగ్ని వలె నీ దేహంలో పురుషుడు ఉంటాడు. "సో2హమ్" అనే జ్ఞానమే ఆ పురుషుణ్ని చూడడం. ఈ పురుషుడినే అమృతార్థతత్త్వం అని, బ్రహ్మము అని శ్రుతి వేదం చెబుతున్నది. అన్ని తత్త్వాలకూ ఈ అమృతార్థతత్త్వమే శిరోమణి అతి ఉత్కృష్టం. దీన్ని చూసినవాడు మృత్యువును గెలుస్తాడు. తత్త్వాల కన్నిటికీ అనులోమంలో తోపు ఉండడం, ప్రతిలోమంలో లయం లేకపోవడం జరుగుతాయి. అవన్నీ ఏకమై బ్రహ్మాన్ని చూడడమే ఏకత్వం. ఎంతో గొప్ప విషయమైన దీన్ని నీకు చెప్పాను" అని, ఆపైన సనత్కుమారుడు, అధ్యాత్మం, అధిభూతం, అధిదైవతం వీటిని వివరించి, ఇంకా ఈ విధంగా అన్నాడు.

"ఈశ్వరా! అన్ని ప్రాణులకూ అధ్యాత్మం సామాన్యం. ఇది తెలియడమే నిజమైన ఎఱుక, జ్ఞానం. తక్కినదంతా ఎఱుక కాదు. దేవతలు, మానవులు, గంధర్వులు, తదితరులలో ఎవ్వరూ ఈ అధ్యాత్మాన్ని ఎరుగరు. బ్రహ్మసత్యాన్ని గ్రహించడం వీరెవ్వరికీ తరం కాదు.



ఆ ప్రబోధం ఎంతటి గొప్పదో నీవే ఊహించు. దాన్ని ఓంకార శబ్దంతో రచిస్తారు. అది ఒక్క నారాయణునికి మాత్రమే తెలిసిన విషయం. ఆయన మూలంగా


**శ్రీమతి తిరుమల నీరజ**

దేవతలు, మునులు, సిద్ధసాధ్యులు, మొదలైన వారిలో పరమశ్రేష్ఠులు కొందరు గ్రహించారు. ఐనా, ఆ తత్త్వదృశ్యం తెలియదు. ఎందు కంటావా? దాన్ని చూసినవాడు బంధవిముక్తుడు అవుతాడు కదా! ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి కలసి, అహంకరణబంధం పోయిన జీవుణ్ని పొందుతాయి. వీటన్నిటితో కలసి ఆ జీవుడు పరతతత్త్వంలో లీన మవుతాడు. దీన్ని ఎవరు చూడగలరు? భూతాలన్నీ అణగిపోయిన వెనుక, తనను తానే చూస్తూ చీకటి లేకుండా వెలిగే జ్ఞానం ఆ తత్త్వానికే తెలుస్తుంది కానీ, అన్యులకు ఇతరులకు తెలియదు.

**సనత్కుమారుడు మార్కండేయమహర్షిని అనుగ్రహించడం**

మార్కండేయమహర్షి మేరుపర్వతం మీద తపం చేసుకుంటూ ఉన్నాడు. ఒకనాడు సూర్యబింబంతో సమాన మైన కాంతితో ప్రకాశిస్తున్న ఒక దివ్యవిమానం ఆయన వద్దకు వచ్చి ఆగింది. అందులో అతి ఉగ్రతేజంతో ఉన్న అంగుష్ఠ మాత్రగాత్రుడైన చేతి బొటనవేలంత ఎత్తు ఉన్న ఒక మహాపురుషుడు ఉన్నాడు. మార్కండేయుడు విస్మితుడై, ఆయనకు ఎదురువెళ్ళి, పాదాలను కన్నులకు అద్దుకొని, ఆయనను పూజించాడు. "దేవా! నన్ను అనుగ్రహించడానికి వచ్చిన ఆదిదైవతంగా నిన్ను భావిస్తున్నాను. నీ మాహాత్మ్యం తెలిపి దయ చూడు" అన్నాడు.

దానికి ఆ మహాత్ముడు, "మరీచి మొదలైన మహర్షులు నన్ను తపస్సు, వీర్యం, జ్ఞానం (మిగతా 28వ పేజీలో)



# కీర్తి మూర్తులు

**శ్రీమాన్ డింగరి లక్ష్మీనారాయణాచార్యులు**

శ్రీసన్నిధానం మాసపత్రిక గౌరవ సంపాదకులు



భగవత్ గుణానుభవంతో భగవన్నామస్మరణయే గొప్ప సంపదగా భావించేవారు భాగవతోత్తములు. అని పెద్దలు చెప్తారు. ఆ విధంగా సదాచార నిష్ఠులై అనుష్ఠాన నియతులై జీవనయానాన్ని సాగించిన వారు శ్రీమాన్ డింగరి లక్ష్మీనారాయణాచార్యులు, జగిత్యాల జిల్లా గోధూరు గ్రామ వాస్తవ్యులై గ్రామంలో ఆధ్యాత్మిక చైతన్యానికి నాంది పలికారు. శ్రీ వైష్ణవ సంప్రదాయ ఆచార పరాయణులైన డింగరి నరహరి అయ్యంగారికి దత్తపుత్రులు, శ్రీమాన్ డింగరి నరసింహాచార్యుల కుమారులు. జగిత్యాలలో వీరు ఉన్నత విద్యను పూర్తి చేశారు.గోధూరు గ్రామానికి సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికై 18 సంవత్సరాలు గ్రామాభివృద్ధికి కృషి చేశారు. గ్రామంలో ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం నిర్మాణం గావించారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి కరకమలములతో 1983లో దేవాలయ ప్రతిష్ఠ, ఉత్సవాలు జరిపించారు. నాటి నుండి 18 సంవత్సరాలు స్వయంగా అర్చకత్వాన్ని నిర్వహించారు. పాంచరాత్రాగమ రీతిలో ఆరాధన విధులను ఏర్పాటు చేశారు. దేవాలయ అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేశారు. సమీపంలోని 12 గ్రామాల్లో పౌరోహిత్యమ్ చేశారు.



అన్యమత ప్రభావం మతమార్పిడులు జరుగుతున్న నేపథ్యంలో గ్రామస్థులను ఆధ్యాత్మికంగా చైతన్యవంతులను గావించారు. వినాయక పూజలు, దుర్గా నవరాత్రులు, ధనుర్మాసోత్సవాలు, ఇలా ఎన్నో వైదిక కార్యక్రమాలను నిర్వహిస్తూ గ్రామంలో అందరూ పాల్గొనేలా ప్రోత్సహించారు. పౌరోహిత్యం, జ్యోతిష్యం, వైదిక ధర్మ పరిరక్షణలో వీరు చేసిన సేవ ఎనలేనిది. పేరు ప్రతిష్ఠలకు ప్రాకులాడకుండా పదిమందిని ప్రేమతో కలుపుకుంటూ ధార్మిక విషయాలను బోధించారు. అందరిలో దైవభక్తి నింపుటయే లక్ష్యంగా వారి జీవితాన్ని సాగించారు. పెద్దల పండితుల శ్రీసూక్తులను జ్ఞాన సంపదను సమాజానికి అందించడం ద్వారా ఆధ్యాత్మిక భావ విస్తృతిని కలిగించాలనే లక్ష్యంతో నాడే శ్రీసన్నిధానం పత్రిక ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. వారి జ్యేష్ఠ కుమారులైన శ్రీమాన్ డింగరి శ్రీనివాసమూర్తి ద్వారా శ్రీసన్నిధానం ట్రస్ట్ మరియు ఆధ్యాత్మిక మాసపత్రికను ప్రారంభించుటకు ప్రోత్సహించారు. నియమబద్ధమైన జీవన విధానంతో అనుష్ఠాన నిరతితో జీవించిన శ్రీమాన్ డింగరి లక్ష్మీనారాయణాచార్యులు లేని లోటు ఆ గ్రామంలో తీర్చలేనిది. శ్రీసన్నిధానం మాసపత్రిక వ్యవస్థాపనలో ప్రోత్సాహకులు అయిన శ్రీమాన్ డింగరి లక్ష్మీనారాయణాచార్యులు సెప్టెంబర్ 13 న ఆచార్య తిరువడిలో వేంచేశారు. వారికి శ్రీసన్నిధానం ఆధ్యాత్మిక మాస పత్రిక శ్రద్ధాపూర్వక నివాళి నర్పిస్తున్నది. వారి గురించి పలువురు గోధూరు గ్రామస్థుల అభిప్రాయాలు.







# తెలుసు కోవలసినవి మూడే!



శ్రీ.ఉ.వే.శ్రీమాన్ వంగల వెంకటాచార్యులు

(క్రిందటి సంచిక తరువాయి)

ప్రతీ వ్యక్తి తెలుసుకోవలసినవి చిత్ (జీవుడు), అచిత్ (ప్రకృతి) ఈశ్వర (శ్రీమన్నారాయణుడు) తత్వములు. వీటిస్వరూప స్వభావములను తెలుపుటకే "చిదచిదీశ్వర" అను ఈ మూడు ప్రకరణములతో కూడిన తత్త్వత్రయము అను గ్రంథము వచ్చినది.

ఈ మూడు తత్వాలలో మొదటిది అయిన చిత్తును గురించి మనం ముందుగా తెలుసు కొందాం. చిత్తనగా ఆత్మ. ఈఆత్మ చైతన్యము కలవస్తువు. చైతన్యము అనగా జ్ఞానము, జ్ఞానమునకు ఆధారమైన వస్తువు. ఈ ఆత్మవస్తువు ఏదోఒక శరీరమును ఆధారముగా చేసుకొని యుండును. ఆశరీరము మానవ శరీరము కావచ్చు దేవ శరీరము కావచ్చు, తిర్యక్ (జంతు) శరీరము కావచ్చును లేదా స్థావర (చెట్టు పుట్ట) శరీరము కావచ్చును. విచిత్రమేమిటంటే ఈచిత్తనబడే జీవుడు తనగురించి తాను తెలుసుకోవాలి, అచిత్తనబడే ప్రకృతి గురించి తెలుసుకోవాలి మరియు ఈశ్వరుడనబడే శ్రీమన్నారాయణుని గురించి తెలుసుకోవాలి. ఈమూడింటి గురించి తెలుసుకొనే వాడు జీవుడు కనుక జీవుని గురించి ముందుగా ఈ చిత్ ప్రకరణముద్వారా తెలుపుచున్నారు.

ఈ ఆత్మస్వరూపము ఎలాంటిదంటే. ఇది అన్నమయ, ప్రాణమయ మరియు మనోమయ కోశములకు పైన నుండునది. ఇది శరీరము వంటిది కాదు, ఇంద్రియములవంటిది కాదు. మనస్సువంటిదికాదు ప్రాణము వంటిదికాదు, బుద్ధివంటిది కాదు వీటన్నిటికంటే వేరైనది వీటన్నిటికంటే ప్రత్యేకత కలది. ఇది శరీరముకంటే ఎట్లు వేరైనది? శరీరముకంటే ప్రత్యేకత ఏమి? అనగా, శరీరము కాళ్ళు, చేతులు, కన్ను, ముక్కు మొదలగు అనేక అవయవములతో కూడి యుండి అవయవముల సముదాయముగా నుండును. కానీ ఆత్మ అట్లు అవయవములతో కూడి యుండదు. అట్టి శరీరములో ఉండే అన్ని అవయములకు చైతన్యము ఉండదు. ఆ అవయవము శరీరముతో చేరి యున్నపుడు పనిచేయును. శరీరము నుండి అవయవము ఖండింపబడి వేరైనచో అవి చైతన్యమును కోల్పోయి పనిచేయవు. దీనిని బట్టి వాటికి స్వయం చైతన్యము లేదని తెలియుచున్నది కదా! అంతేకాక ప్రతీ అవయవములోనూ జీవుడు ఉండడు. అట్లు ఉన్నట్లయితే ఈ అవయవములు ఒకదానితో ఒకటి దెబ్బలాడుకోకుండా ఉండవుకదా! ఈ అవయవములు పరస్పరం దెబ్బలాడుకోకుండా ప్రేమగా ఉన్నాయంటే దానర్థం ఆ అవయవములతో కూడిన దేహమునందు ఒకడే జీవుడు ఉన్నాడని అర్థం. ఏదో ఒక అవయమునందే జీవుడు ఉన్నాడని చెప్పినచో ఆ అవయవము శరీరమునుంచి తెగిపోయినచో దాని బాధ వేరొక అవయవము అనుభవించుట అనేది కుదరదు. శరీరమునందు ఏమూల ఏచిన్న బాధకలిగినా అది మిగిలిన అవయములైన కన్ను మొదలైనవి అనుభవించుచున్నవి దీనిని బట్టి ఆత్మ అవయవములు కాదు వాటితో కూడిన దేహమూ కాదు అని స్పష్టముగా తెలియుచున్నది.

ఆత్మ వీటికంటే వేరైనది. అంతేకాక శరీరముగానీ అవయవములుగానీ ఆత్మ అయినచో ఈశరీరమునాది, ఈ కన్ను నాది అని చెప్పుటకుదరదు. అలాగే ఈ శరీరమును నేను అని వ్యవహరించుట కూడా కుదరదు. నేను అని వ్యవహరింపబడునది శరీరమేకదా కానీ ఈ శరీరము మరణించిన తర్వాత శవమనబడే ఇది నేను అని గానీ నాది అని చెప్పుటలేదు. శరీరము శవంగా ఉన్నదశలో నేను నాదియని చెప్పు వ్యక్తి ఎవరూ ఆశరీరమునందు లేనందువల్ల నేను నాదియను వ్యవహారము కనబడుటలేదు. వీటి వల్ల శరీరము ఆత్మ కాదని మనకే తెలియుచున్నది. దీనినిబట్టి నేను నాది అని చెప్పునది శరీరములో ఉండే జీవుడే కానీ శరీరముకాదు ఆశరీరములో యుండే అవయవములు కాదు అని స్పష్టముగా తెలియుచున్నది కదా!

పోనీ ఇంద్రియములను ఆత్మా అందామా అంటే అదీ కుదరదు. ఎందువలన అనగా చక్షురింద్రియమును (కన్ను) ఆత్మాఅందామా అంటే గుడ్డివానికి వస్తువు కనుబడుటలేదు ఆ

ఇంద్రియమే ఆత్మ అయితే గుడ్డివాడు కూడా చూడాలి అట్లు జరుగుటలేదు కావున అట్లు చెప్పుట కుదరదు. శ్రోత్రేంద్రియమును (చెవి) ని ఆత్మా అందామా అంటే చెవిటివానికి వినబడుటలేదు కావున దానినీ ఆత్మా అనలేము. ఇదే విధముగా మిగిలిన ఇంద్రియములు కూడా ఆత్మ కాదు అని మనకే తెలియుచున్నది. మనస్సు ఆత్మ అందామా అంటే. మనస్సనేది స్మరించుటకు ఒక సాధనముగా ఏర్పడినది గాన దీనిని ఆత్మ అనరాదు. వ్యవహారములో కూడా నాకు మనసు బాలేదు అని చెప్పుచున్నాము. నేను బాగాలేను అని చెప్పుటలేదుకదా. దీనిని బట్టి మనసనేది నేను అనబడేది కాదు అని తెలియుచున్నందున మనస్సుకంటే వేరైన నేను అనబడేది ఇంకొకటి ఉన్నది అని తెలియుచున్నది. అదే ఆత్మ.

మరి నేను నాది అని చెప్పువారెవరు. ఈ శరీరము నాది అని ఈ కాలు కన్నుమొదలగునవి నావి అని చెప్పుచున్నది ఆ శరీరములోపల నుండే చైతన్యము కల ఆత్మయేయని మనకే స్పష్టముగా తెలియుచున్నది. అంతేకాక ఈ శరీరాదులు ఒక్కొక్కప్పుడు కనబడకపోవుట చేత. మెలకువ దశలో నేను నాది అని తోచు శరీరము, నిద్రాదశలో అట్లు తెలియుటలేదు. నిద్రపోయి లేచిన తర్వాత ఆవ్యక్తి నేను వళ్ళు తెలియకుండా నిద్రపోయాను అని అంటున్నాడు కదా. కానీ ఆత్మ ఎప్పుడూ ఉండును అనగా శరీరము ఉన్నప్పుడు లేనప్పుడూ, నిద్రాదశలోను మెలకువ దశలోను ఉండును. జన్మ మరణములవలన ఈ శరీరము ఒకసారి కనబడుట ఒకసారి కనబడకుండుట జరుగుచున్నది. కానీ ఆత్మ ఎప్పుడూ ఉండును దానికి జనన మరణములు లేవు. కనుకనే ఒక వ్యక్తి తాను పుణ్య పాపాది ఫలములను అనుభవించునపుడు నాపూర్వ జన్మకర్మ ఫలమును ఈ జన్మలో అనుభవించు చున్నాను అని చెప్పుట మనము చూచుచునే యున్నాము. దీనిని బట్టి ఈశరీరము ఆత్మకానేకాదు. శరీముకంటే ఆత్మ వేరైనది అని మనకు తోచుచున్నది.

అట్లే కన్ను చెవి మొదలగునవి పటుత్వమున్నపుడు (బాగున్నపుడు) పనిచేయుచు, గుడ్డితనము చెవిటితనము మొదలగు దోషములు వచ్చినపుడు పనిచేయకపోవుటను బట్టి ఇంద్రియములు ఒకప్పుడు కనిపించుట ఒకప్పుడు కనిపించకపోవుట అనునది మనకే తెలియుచున్నది. మనస్సు ఒక్కొక్కప్పుడు మూఢమగుట ఏమీ తెలియకపోవుట ఒక్కొక్కప్పుడు నేను మనసులో సంకల్పించుకొన్నాను అనుటను బట్టి మనుసు కూడా ఒకప్పుడు ప్రకాశించుట ఒకప్పుడు ప్రకాశింపకుండుట అనునది మనకే తెలియుచున్నది. అటులే ఉచ్వాస నిశ్వాసాదుల (గాలి పీల్చుట వదులుట) ద్వారా ఉన్నట్లు తెలియు ప్రాణములు ఉత్కటమైన కోమాదశలో తెలియుటలేదు కదా! కనుక ప్రాణములు కూడా ఒకప్పుడు ఉండుట ఒకప్పుడు లేకుండుట అనునది మనకే తెలియుచున్నది. విషయమును గ్రహించుటకు ఉపయోగపడు జ్ఞానము విషయము గ్రహించని దశలో లేకుండుట అనునది మనకే తెలియుచున్నది.

పైన తెలిపినవన్నీ మన అనుభవములో మనకు తెలియుచునేయున్నవి. ఒకప్పుడు నాకన్ను ముక్కు చెవి బాగా పనిచేసేవి. ఇప్పుడు గుడ్డి వాడిని చెవిటివాడిని అయిపోయాను పనిచేయుటలేదు అని చెప్పుట. నామనసుకు పూర్వం చాలా స్పష్టంగా అన్నీ తెలిసేవి, ఇప్పుడు ఏమిటో నాకు ఏమీ తెలియుటలేదు అనుట మనకు అనుభవంలో ఉన్న విషయమే. అప్పుడు నాకు ప్రాణంపోయింది అనుటకూడా మనకు తెలిసినదే.

ఒకే ఆత్మ అనేక దేవ, మానవ, తిర్యక్ రూపమైన శరీరములను ధరించుట, అలాగే ఆ శరీరమునకు అవయవములు కూడా కాళ్ళు, చేతులు మొదలగునవి అనేకంగా యుండుట, ఇంద్రియములు కూడా కన్ను ముక్కు మొదలైనవి అనేకముగా ఉండుట, అలాగే ప్రాణములు కూడా ప్రాణ, అపానాది రూపంలో ఉండుట, బుద్ధి కూడా వస్తువుని బట్టి ఇది రాయి ఇది మట్టి ఇది చెట్టు ఇట్లు అనేకముగా ఉండుట మనకు స్పష్టంగానే తెలియుచున్నది. కానీ వీటన్నిటినీ కలిపి నేను అని వ్యవహరించునది ఈశరీరము నాదియని, ఈ అవయవము నాదియని, ఈ ఇంద్రియములు నావియని, ఈబుద్ధి నాదియని మరియు ఈ ప్రాణంనాదియని చెప్పువాడు ఒక్కడే కనబడుచున్నాడు అట్లు కనబడు జీవుడే ఆత్మ ఈ ఆత్మ దేహాదులకంటే వేరైనది అని మనకు అనుభవంద్వారా తెలియుచునే యున్నది కదా! పైన చెప్పిన ఉపపత్తులను బట్టి ఆత్మ పైన చెప్పిన అన్నిటికన్నా ప్రత్యేకమైనది.



గీతామృతం

# కృష్ణం వందే జగద్గురుం

"కృష్ణం ధర్మం సనాతనం" కృష్ణుడే సాక్షాత్ ధర్మము. ధర్మమును, ధర్మమును ఆచరించువారిని ఉత్తమ స్థితి నుండి దిగజారనీయడు.

అర్జునునికి ఉభయసేనల్లో గురు, బంధు, మిత్రాదులు కనిపించారు. "పితౄన్ అథ పితామహాన్ ఆచార్యాన్ మాతులాన్ భ్రాతౄన్ పుత్రాన్ పౌత్రాన్ సఖీన్ తథా శ్వశు రాన్ సుహృదశ్చైవ" ఒక్కసారిగా బంధుస్నేహము పెల్లుబుకి మానసిక దైన్యమును, శరీర దౌర్బల్యమును పొందాడు. అతని హృదయములో భీరుత్వము, అశాంతి, వ్యాకులత చోటు చేసుకున్నాయి. యుద్ధోత్సాహము కోల్పోయాడు. దీనుడు, హృదయ దుర్బలుడు, ఉత్సాహరహితుడు ఏకర్మనూ చేయలేడు. చేసినా విపరీత ఫలితమునే పొందుతాడు. అనివార్య బంధువియోగము అర్జునునియందు రాజ్య భోగముల పట్ల మోహ పూరిత శోకము, వైరాగ్యమును కలుగచేసాయి.

" న కాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ, ఏషాం అర్థే కాంక్షితం నో రాజ్యం భోగాః సుఖాని చ" నేను యుద్ధమునందు విజయమును, రాజ్య భోగములను కోరనని అన్నాడు అర్జునుడు.

ప్రశాంత లౌకిక జీవనము మరియు ఆధ్యాత్మిక ప్రగతి సోపానమునకు వైరాగ్యము తొలి మెట్టు. అయితే మోహము పూర్తిగా తొలగి శుద్ధ వివేకము కలగాలి. మోహముతో ధర్మాధర్మ వివేచన కోల్పోయాడు అర్జునుడు. కౌరవ సంహారముచే తమకు పాపము కల్గుతుందనుకున్నాడు. "పాపమేవ ఆశ్రయేత్ అస్మాన్ హత్వా ఏతాన్" బంధుస్నేహ ప్రభావముచే అర్జునునకు శాస్త్రీయ స్వధర్మ ఆచరణ కంటె కులక్షయ, మిత్రద్రోహ పాతకములనుండి తప్పుకొనుటయే (ఆభాస) ధర్మముగా గోచరించినది.

"కులక్షయకృతం దోషం మిత్రద్రోహే చ పాతకం।
కథం న జ్ఞేయం అస్మాభిః పాపాత్ అస్మాన్ నివర్తితుం॥"

యుద్ధముచే కురువంశము నాశమగును. తద్వారా సనాతన కుల ధర్మములను పాటించువారు మిగలకపోగా ధర్మము నశించి అధర్మము వృద్ధి పొందును. మిత్రులను సంహరించుట కూడా మహాపాతకము. యుద్ధము చేయుట వలన కలుగు ఈ రెండు దోషములను రాజ్యలోభముచే కౌరవులు గుర్తించక యుద్ధమును ఆపకపోయిననూ, ధర్మాధర్మము



**శ్రీమాన్ ఆచి వేంకట పాండురంగాచార్య**

లను చక్కగా తెలిసి ఆచరించుచున్న మనము ఆ దోషములను గుర్తించి యుద్ధము ఆపుటకు ప్రయత్నము ఎందుకు చేయకూడదు.

మోహము, అజ్ఞానముచే మానవుడు ప్రాయః అధర్మమును, స్వధర్మ అనాచరణను కూడ (ఆభాస) ధర్మముగా భావిస్తాడు. సమర్థించుకుంటాడు కూడాను. అయితే, కారణము బంధు స్నేహజనిత మోహమే అయినా, అర్జునుని బాధించిన విషయములు చర్చనీయాంశములే. యుద్ధము వలన ప్రాణ నష్టము, విధ్వంసము సంభవించుట నేటి ప్రపంచములో ప్రత్యక్షమే కదా. మానవ సమాజమునందు యుద్ధము, సామూహిక (జాతి, కుల) ప్రాణనష్టము, మిత్రద్రోహము అవాంఛనీయములే. కుల(జాతి) క్షయముచే ధర్మాచరణ లోపము, వర్ణసాంకర్యము, సనాతన జాతి ధర్మ నాశము సంభవించునని భయపడుట సమంజసమే.

ప్రాచీన కాలములో సమాజము 4 వర్ణములుగా వ్యక్తి స్వభావము, గుణము, శ్రద్ధ, సామర్థ్యమును బట్టియే విభజించబడినవి. స్వయంగా కృష్ణభగవానుడే భగవద్గీతలో ఈ విషయాన్ని చెప్పాడు. (సశేషం)

## దాశరథి శతకము

(11 వ పేజీ తరువాయి) అని శాస్త్రోక్తి. 'శ్రీరఘురామ' లోని శ్రీకారము మంగళాదిగాను, సంపద్యుక్తుడైన రఘురాముని గౌరవ సంబోధనార్థకముగా మాత్రమే గాక లక్ష్మీవాచకమైన జానకీ సంబంధ సుగంధాన్ని కూడా విరజిమ్ముచున్నది.

సీతామాత సాక్షాత్ లక్ష్మీ అవతారమే కదా! "సీతాలక్ష్మీః" అని శ్రీరామాయణంలోని బ్రహ్మాది దేవతల సంస్తుతి. "ఆదిభూతా మహాలక్ష్మీః సీతా జనకనన్దినీ" అని బృహద్బ్రహ్మమనే ఆగమ సంహితోక్తి. ఇటువంటి పరశ్శత ప్రమాణములను బట్టి మన రామదాసుగారు సీతారమా సమేతుడయిన సీతారాముని కీర్తించుచునే శతకారంభమును చేసినారు.

"రామం రమేశం భజే" అను బుధకౌశిక ముని యొక్క వచనంలోని స్వాపదేశార్థమిదే. "శ్రీరమసీతగాగ" అను మన రామదాసుగారి పద్యంలోని స్వారస్యమూ ఇదే,

శ్రీకారము లేకున్నను కేవల రామ శబ్దము కూడా రమా సంబంధ సముద్భవము అనే విషయం కలిగించక మానదు. వచ్చే సంచికలో ఆవిషయాన్ని సప్రమాణంగా తెలుసుకుందాం!

## శ్రీరామానుజ సుధామాధురి

(7 వ పేజీ తరువాయి) కావలసిన దానిని పట్టుకొని తన పిల్లలకు తినిపించి తాను తినును. అట్లే వేదాంత సారాన్ని గ్రహించాలి. ఉప్పు సమతౌల్యత వలన పదార్థము రుచి మారి నట్లు అందరితో కలిసిపోవాలి. అలాగే ఎన్నిసార్లు భోజనపు పంక్తి నుండి లేపినా నిగర్వియై కోపించక ఉన్న నీలాంటి వాడే శ్రీవైష్ణవుడు అని పరాశరులు వివరించారు. అనంతార్యుల ఆచార్య నిష్ఠకు భక్తికి గుర్తుగా తిరుమలలో కొన్ని ఉత్సవాలను కూడా నిర్వహిస్తారు. "ఆడిప్పూరం" అని కర్కాటక మాసం పుబ్బ నక్షత్రం గోదా తిర్నక్షత్రం నిర్వహిస్తారు. ఆ రోజే అనంతాళ్వాన్ పరమపదించడం వలన ఈరోజు ప్రత్యేక ఆరాధన నిర్వహిస్తారు. భగవత్ రామానుజాచార్యుల ఆజ్ఞతో ఆధ్వర్యంలో పెద్ద జీయర్ వ్యవస్థ ఏకాంగిల ఏర్పాటు, ఇత్యాదులు తిరుమల లో ఏర్పాటు చేయబడ్డాయి.

ఆచార్యుల ఆజ్ఞను అనుసరించడమే జీవిత లక్ష్యంగా పుష్ప కైంకర్యం చేసి నిత్య కీర్తి మూర్తులై ఆరాధింపబడు తున్నారు అనంతాళ్వాన్.

★


## పుస్తక పరిచయం

### సచ్చరిత్రసుధానిధి స్మృతిసంహిత

ప్రాచీన ఋషులు మనకందించిన గొప్ప సంపదలు వేదోపబృంహణములైన స్మృతులు. అవి దోషభూయిష్టమైన ఆచరణలు సరిచేసే కరదీపికలు. అట్టి విలువైన "సచ్చరిత్ర సుధానిధి స్మృతి సంహిత" సకల ధర్మ శాస్త్ర సారముగా శ్రీవీరరాఘవాచార్యులచే రచించబడినది. ఈ ప్రాచీన గ్రంథ సంస్కృత మూలానికి 60 సంవత్సరాలకు పూర్వము పల్లెర్లమూడి రామానుజాచార్యులచే ఆంధ్రానువాదంగా




శ్రీవైష్ణవ పత్రిక ద్వారా తెలుగులో ప్రకటించబడింది. దానినే నేటికి మనస్విని పబ్లికేషన్స్ వారు తిరిగి "సచ్చరిత్ర సుధానిధి" గ్రంథాన్ని అందరికీ అందుబాటుగా ముద్రించారు. 290 పేజీలు గలిగిన ఈ గ్రంథంలో మూల శ్లోకాలు,అనువాదకర్త పరిచయం 'బ్రహ్మపార' స్తోత్రము వ్యాఖ్యానం ముద్రించారు. క్రమంగా శ్రీవైష్ణవ సమయాచారములు సకల కృత్యాచరణలు, ఇంద్రియ శు ద్ధి, ఆచమనాదుల నుండి స్నాన, సంధ్యా, భోజన, మధ్యాహ్న సాయంకాలాది సకల విధులను వివరించారు. అలాగే స్త్రీ ధర్మాలు ఆచరణలు, మరియు ఆశ్రయ, నిమిత్త, సంసర్గ, జాతిదుష్టాది పదార్థాలు, స్వాధ్యాయ విధులు మొదలగు అనేక అంశములు వివరించబడినవి. ధర్మబద్ధమైన



25. ప్రపన్న పారిజాతము (2016) రూ. 100/-
26. మొదలియాండాన్ వైభవము (2016) రూ. 150/-
27. శ్రీరామాయణ నక్షత్రమాలిక -శ్రీరామానుజ చరిత్ర (గేయ రూపము) (2016) రూ.50/-
28. స్మృతిరత్నాకరమ్ - ధర్మశాస్త్రమ్ (2017) రూ. 600/-
29. శ్రీస్తవము - అర్థ, ఆకాంక్షా, శబ్ద, సమాస, భావ విశేషాలతో: (2017) రూ. 50/-
30. తెలంగాణ - విశిష్టాద్వైత సంప్రదాయ ప్రవర్తకులు (2017) రూ. 150/-
31. శాండిల్యస్మృతి (2017) రూ. 150/-
32. బ్రాహ్మణ భోజన విధి - ప్రమాణాలు (2017) రూ.80/-
33. రత్నత్రయీ(ద్వయమంత్రము-శ్రీవిష్ణుపురాణము-స్తోత్ర రత్నము)(2018) రూ. 440/-
34. శ్రీవైష్ణవ భగవదారాధన క్రమమ్ (2007, 2018, 2021) రూ. 120/-
35. స్మృతిముక్తాఫలము-అపరసిద్ధాంతము-ధర్మశాస్త్రకారికా సంగ్రహం(2018) రూ. 260/-
36. బ్రహ్మమేధాంతర్గత శ్రీచూర్ణ పరిపాలన క్రమః (2018) రూ. 170/-
37. తిరుప్పావై దివ్యార్థసౌరభం (2018) రూ. 270/-
38. శ్రీ వైష్ణవ శ్రాద్ధకర్మ ప్రయోగము (2019) రూ. 120/-
39. కణ్వస్మృతిః (2020) రూ. 170/-
40. యజుర్వేదాహ్నికము (2020) రూ. 150/-
41. శ్రీవిష్ణుపురాణమ్ - శ్రీ విష్ణుచిత్తీయ - సవ్యాఖ్యానమ్ (2020) రూ. 1100/-
42. విశిష్టాద్వైత ఉపయుక్తాంశ సంగ్రహము (2020) రూ. 200/-
43. ఆశౌచశతక వ్యాఖ్యానం (2021) రూ. 260/-
44. సచ్చరిత్ర సుధానిధిః (స్మృతిఃసంగ్రహః) (2021) రూ. 260/-
45. వైదికభోజన పద్ధతి(2021) రూ. 44/-
46. సాలగ్రామ వైభవమ్ - శ్రీవైష్ణవ భగవదారాధన క్రమమ్ - ఇతిహాస పురాణ - దివ్యప్రబంధాది - గ్రంథాచార్య పరంపరలు (2021) రూ. 130/-

For Copies:
K.V.Laxmana Swamy
H.No. 16-1-24/160, S.R.T., Near Sri Ramalayam,
Saidabad Housing Board Colony, Hyderabad - 500 059, T.S.
Mob: 94902 67511; 8331817994

రూ.260/-

సాత్విక జీవనం గడపాలను కునే వారికి, అందరికీ సందేహ నివృత్తి చేసే పండితులకు, సాంప్రదాయ పరులకు చక్కని సమాచారాన్ని అందించే ఉపయుక్త గ్రంథం. "సచ్చరిత్ర సుధానిధి" మనస్వినీ ప్రచురణల ప్రత్యేక గ్రంథం. దీని వెల 260/- లభించు ఫోన్ నెం. 8331817994, 9490267511,

★

# నవరాత్రి వైశిష్ట్యము

ప్రత్యేకం

ఆశ్వయుజ మాసం అనేకములైన ప్రత్యేకములు గల మాసం. మాసారంభమునుండే శరన్నవరాత్రారంభం జరుగుతుంది. ఆశ్వయుజ, కార్తీక మాసములు 'శరదృతువు' కావున ఆశ్వయుజ శుక్ల పాడ్యమి నుండి అమ్మవారిని పూజించే క్రమం దేశమంతటా ఆచారంగావుంది.


ఈ శరత్కాల నవరాత్రములను పురస్కరించుకుని శ్రీరామాయణమును నవాహ్నికంగా పారాయణ జరిపి, విజయదశమి నాడు శ్రీరామ పట్టాభిషేకోత్సవమును జరిపే విలక్షణమైన విధానం శ్రీ వైష్ణవాలయములలో ప్రసిద్ధంగా ఉంది.

నవరాత్ర శబ్దము శుక్ల ప్రతిపత్ మొదలుకొని మహానవమి పర్యంతం చేయు కర్మమునకు పేరు. ఈ కర్మ యందు పూజయే ప్రధానము. ఉపవాసాదికము స్తోత్ర జపాదికము అంగము. కావున కులాచారము ననుసరించి ఉపవాసము, ఏకభుక్తము, నక్తము, అయాచితము అను వాటిలో ఒకదాని ననుసరించి స్తోత్ర పారాయణ, జపాదులతో పాడ్యమి (ప్రతిపత్) మొదలు నవమి వరకు పూజ చేయు విధానమునకు నవరాత్రమని పేరు. దీనిలో పూజ ప్రధానమగుటవల్ల కొన్ని కులముల వారికి జప స్తోత్రాదులు కనిపించుట లేదు.

> విజయదశమినాడు శ్రీరామ పట్టాభిషేకం, విజయయాత్ర, శమీపూజ, ఆయుధపూజ వంటివి శ్రీరాముని ఉపాసనలోని అంశములు.
> ఆశ్వయుజ శుక్ల పక్ష నవమి యందు ముగియునట్లు వీరలక్ష్మీ అమ్మవారికి ప్రతిఏటా ఈ శరన్నవరాత్రములలో ఉత్సవమును చేయాలి.

ఈ నవరాత్ర మందు అనుకల్పములు ఉన్నవి. తదియ మొదలు నవమి వరకు సప్తరాత్రము, పంచమి నుండి పంచరాత్రము, సప్తమి నుండి త్రిరాత్రము, అష్టమి నుండి ద్విరాత్రము, కేవలాష్టమి లేదా కేవలనవమి యందు ఏకరాత్రమయినా చేయవచ్చును. ఈ విధానములలో కులాచారమును బట్టి, లేక ఏవైనా అశౌచాది ప్రతిబన్ధకముల వల్ల ఇట్టి వ్యవస్థను ఏర్పాటు చేయుట జరిగింది.

ఈ నవరాత్రములలో శ్రీమహాలక్ష్మి, శ్రీమహాసరస్వతి, శ్రీరాజరాజేశ్వరి అను శక్తి ఆరాధన చేయు విధానం విస్తృతంగా వ్యాప్తిలో ఉంది. అలాగే శ్రీరాముని ఆరాధించు విధానం కూడా కనిపిస్తుంది. నవరాత్ర శ్రీరామాయణ పారాయణ ద్వారా శ్రీరాముని ఉపాసన ఈ నవరాత్రములలో ప్రసిద్ధం. విజయదశమినాడు శ్రీరామ పట్టాభిషేకం, విజయయాత్ర, శమీపూజ,




**శ్రీమాన్ శ్రీ కె.ఇ.స్థలశాయి,** స్థానాచార్యులు

శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం భద్రాచలం


ఆయుధపూజ వంటివి శ్రీరాముని ఉపాసనలోని అంశములు.

మహాలక్ష్మియే 'మహిషాసురమర్దని'' అనే విషయం మార్కండేయ పురాణంలో కనిపిస్తుంది. కావున ఈ నవరాత్రములలో మహాలక్ష్మిని అష్టలక్ష్మీ స్వరూపురాలుగా ఆరాధించే పద్ధతి శ్రీవైష్ణవ సంప్రదాయంలో కనిపిస్తుంది. మహాలక్ష్మికి సంబంధించిన ధ్యాన శ్లోకం మార్కండేయ పురాణంలో ఒకటి కనిపిస్తోంది

అక్షస్రక్ పరశుం గదేషు కులిశం
పద్మం ధనుః కుండికామ్
దండం శక్తి మసిం చ చర్మ జలజం
ఘంటాం సురాభాజనం।
శూలం పాశ సుదర్శనే చ దధతీం
హస్తైః ప్రవాళ ప్రభాం
సేవే సైరిభ మర్దినీం ఇహ
మహాలక్ష్మీం సరోజ స్థితామ్॥

అమ్మవారు (లక్ష్మీదేవి) తన పదునెనిమిది చేతులతో అక్షమాల, గండ్ర గొడ్డలి, గద, బాణం, వజ్రాయుధం,

పద్మము, ధనస్సు, కలశం, దండము, శక్తి, ఖడ్గము, డాలు, శంఖము, ఘంట, సురాపాత్ర, శూలం, పాశము, సుదర్శన చక్రములను ధరిస్తున్నది. పగడము వలె ఎఱ్ఱనైన కాంతి కలదై మహిషాసురుని సంహరించిన పద్మమునందు కూర్చొని యున్న మహాలక్ష్మిని సేవించుచున్నాను" అని ధ్యాన శ్లోక భావము.

పాంచరాత్రాగమాంతర్గతమైన పరమ పురుష సంహితలో ఈ ఆశ్వయుజ మాసంలో లక్ష్మీదేవిని ఆరాధించు విధి కనిపిస్తున్నది.

ఆశ్వినస్య సితే పక్షే నవమ్యాం తు మహోత్సవం
వీరలక్ష్మ్యాస్తు కర్తవ్యం ప్రత్యబ్దం చ ధరాతలే
యస్మా ద్యేషా జగన్మాతా పురుషాకార రూపిణీ
తస్మాత్తస్యాస్తు సంప్రీత్యై కర్తవ్య మిద ముత్సవం

ఆశ్వయుజ శుక్ల పక్ష నవమి యందు ముగియునట్లు వీరలక్ష్మీ అమ్మవారికి ప్రతిఏటా ఈ శరన్నవరాత్రములలో ఉత్సవమును చేయాలి. ఎందుకనగా ఈమె పురుషకార స్వరూపిణి, జగన్మాత. అందువల్ల ఆమె ప్రీతికై ఈ ఉత్సవమును ఆచరించవలెను అని. కావున వైష్ణవాలయములలో ప్రత్యేక సన్నిధిలో వేంచేసి ఉండే లక్ష్మీ అమ్మవారికి ఈ నవరాత్ర ఉత్సవములు జరుపుతారు.

శ్రీమన్నారాయణుని వక్షఃస్థలంలో నిత్యానపాయినిగా ఉండే అమ్మవారికి 'యోగలక్ష్మి" అని, ప్రక్కన విడిగా వేంచేసి యుండే అమ్మవారికి 'భోగలక్ష్మి" అని, వేరుగా ఆలయంలో వేంచేసి యుండే అమ్మ వారికి 'వీరలక్ష్మి' అని పేరు. దీనినే "వీరలక్ష్మీః పృథక్ గేహే" అని ఆగమశాస్త్రం చెబుతున్నది. ఆ వీరలక్ష్మి ఆరాధనను ఈ నవరాత్రములలో నిర్వహిస్తూ, శ్రీరామాయణ నవాహ పారాయణమును చేయడం సాంప్రదాయకంగా వైష్ణవాలయాలలో కనిపిస్తుంది.

విజయ దశమినాడు శ్రీరామపట్టాభిషేకాన్ని జరిపి, సాయంకాలంలో విజయయాత్ర, శమీపూజ, ఆయుధపూజ జరిపి, రావణుని శ్రీరాముడు వధించి విజయాన్ని పొందిన విజయోత్సవమును చేయటం అక్కడక్కడ దేశంలో సంప్రదాయంగా కనిపిస్తోంది. దానినే 'శ్రీరామ లీలా' అంటారు. ఈ ఏడాది అక్టోబర్ 3 నుండి 12 వరకు నవరాత్ర ఉత్సవములు మరియు విజయదశమి జరుగుతున్నది. సంప్రదాయ బద్ధంగా ఈ ఉత్సవాలను జరుపుకుందాం! అలాగే శ్రీకృష్ణుడు నరకాసురుని సంహరించి అతని పీడనుండి విముక్తిని కలిగించాడు. ఈ ఉత్సవాన్ని 'దీపావళి'గా ఆచరించడం సంప్రదాయం. ఆశ్వయుజ బహుళ చతుర్దశి నరకాసురుని శ్రీకృష్ణ పరమాత్మ సంహరించిన రోజు దీనికే 'నరక చతుర్దశి' అని పేరు. ఇది అక్టోబర్ 31వ తేది జరుగుతుంది. అదే రోజు 'దీపావళి' కూడా. విధిగా ఈ పండుగలను ఆచరించి తరిద్దాం! ★

# విశ్వావసు పంచాంగ సిద్ధాంత నిర్ణాయక సభ





స్వీయ ఆరాధన సర్వ ఆదరణ అనే సమతాస్ఫూర్తితో అవిశ్రాంత సనాతన సంస్కృతి సంప్రదాయ ప్రబోధకులు, పరమహంస పరివ్రాజకులు, పద్మభూషణులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నశ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణలో పంచాంగ సిద్ధాంత నిర్ణాయక సభ ముచ్చింతల్‌లో అత్యంత వైభవంగా జరిగింది.






# జ్యోతిర్విజ్ఞానమ్



## శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక

అలంకార వాస్తులో పృథ్వి కూడా ఒక భాగమే! ఈ పృథ్వి అనేకమైన వృక్ష సంపద, పర్వత సంపద, నదుల సంపద జలాశయాల సంపదలతో కూడుకొని ఉన్నది. ముఖ్యంగా భరతభూమి అన్ని సంపదలు కలిగి ఉన్నది. ఆంగ్లేయులు మన దేశానికి వచ్చినప్పుడు ఈ దేశ వాసులు ఆరోగ్యంగా ఆనందంగా సఖ్యంగా ఎందుకు ఉన్నారు దీనికి కారణం ఏమి అని పరిశీలించారట!

వీళ్ళ ఆరోగ్యానికి కారణం ఇక్కడ గల వృక్ష సంపద, అడవులు, ఓషధులు అని తెలుసుకున్నారు. అలాగే ఆవుల ద్వారా వచ్చే గోమయాదుల వలన కూడా అద్భుతమైన లాభాలు ఉన్నాయి అని తెలుసుకొని ఆశ్చర్య పోయారట!

గోమయాదుల వల్ల వన సంపదలు సమృద్ధి అయి పంటలకు చెట్లకు వాతావరణానికే కాక భూగర్భంలో పెరిగే ఖనిజాలకు కూడా ఉపకారిక మవుతున్నయి. భూమిలోని సువర్ణ తామ్ర రజిత పాదరస అభ్రక గంధక కాలకాది ధాతువులు కూడా వృద్ధి పొందుతున్నాయి. అందుకే భారతదేశంలో ప్రతి ఒక్క కుంటుంబానికి 25 గోవులు ఉండాలని శాస్త్రం చెప్తున్నది. భూమి సారవంతం అవటానికి గోవులు ప్రధానమని మన పెద్దలు వేదం ద్వారా గుర్తించి తెలియజేశారు.

ఇక మరొక అంశము శబ్దము ఒక తాతగారి నుండి తండ్రి నుండి కొడుకు నుండి మనమడు ఒకరి మాటను మరొకరు పరంపరగా విని గౌరవించి అనుసరించడం, మరియు సమిష్టిగా జీవించే ఒక గొప్ప లక్షణం మన దేశంలో ఉంది. కలసి ఉండడంలోనే సుఖ సంతోషాలు అని భావించేవారు. పెద్దల ఆజ్ఞను శిరసా వహించేవారు. ప్రకృతిని కాపాడుకుంటూ జీవించేవారు. కానీ ఆంగ్లేయుల పాలన తర్వాత అదంతా మారిపోయింది.

"మానవసేవయే మాధవసేవ" అనే ఆలోచన వచ్చింది. కానీ ప్రకృతి సేవ, సకల జీవరాశుల సేవ మాధవ సేవ కాదా! ఏది లేకపోయినా మానవుడు జీవించలేడు. కానీ మానవుడు లేకపోతే ప్రకృతిలో అన్ని సురక్షితంగానే ఉండగలవు. ఇలా విదేశీయుల ప్రభావంతో ప్రకృతితో అరమరికలు లేకుండా కలిసి జీవించే భారతీయ జీవన విధానం మారిపోయింది. మన వారి ప్రతి ఆచరణ వెనక ఒక ఆచారాన్ని సాంప్రదాయాన్ని పద్ధతిని ఏర్పాటు చేసి పెట్టారు. ప్రకృతితో కలిసి ప్రకృతిని కాపాడుకుంటూ ఉండే ఒక జీవన విధానాన్ని మనకు తయారు చేసి పెట్టారు. ఈ అంశము మన అలంకార వాస్తులో గొప్ప ప్రాధాన్యం వహిస్తుంది. అందుకే ప్రకృతిని సంరక్షణ చేసుకోవడం మూల సూత్రంగా మనం భావించాలి. నేటి కాలంలో భూగర్భ జలాలు తగ్గి ఇంకుడు గుంతలు కట్టుకోవాలని ప్రభుత్వాలు శాసిస్తున్నాయి. కానీ నాటి కాలంలో ప్రతి ఇంటిలో భావిపక్కనే ఒక నిమ్మ చెట్టును ఏర్పాటు చేసుకునేవారు. దానికి వెళ్ళిన నీరు ఇంకి వేర్ల ద్వారా శుద్ధి చేయబడి భూగర్భంలోకి వెళ్లిపోయేది.

అలాగే మన శాస్త్రాల్లోని కొన్ని అంశాలను వక్రీకరింప చేశారు. ఉదాహరణకు

"బాలార్కో ప్రేత ధూమస్య
వృద్ధాస్త్రీ వలువలోదకం
రాత్రౌ దధ్యన్న భుక్తస్తు
ఆయుఃక్షీణం దినేదినే"

నేటి కాలంలో డాక్టర్స్ చెబుతుంటారు. ఎండలో నిలబడితే డి విటమిన్ లభిస్తుంది అని. కానీ ఎప్పటి సూర్యుడు అనే విషయాన్ని తెలుపలేకపోతున్నారు. ఈ శ్లోకం భావం ఉదయించే సూర్యునికి ఎదురుగా నిలబడినా, శవాన్ని కాల్చే ధూమాన్ని పీల్చుకున్నా, పెద్ద వయస్సు గల స్త్రీని వివాహ మాడినా, సూర్యకిరణాలు సోకని నీటిని వాడినా, రాత్రి గడ్డ పెరుగుతో అన్నం తిన్నా ఆయుఃక్షీణం దినేదినే అని చెప్పబడింది. అలాగే ఆయుర్వృద్ధి ఎలా కలగాలి అనేదానికి అదే నీతి శాస్త్రంలో చెప్పబడింది.

(మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో)

# ధ్రువోపాఖ్యానం

## తిరుక్కోళూర్ పెణ్ పిళ్ళై రహస్యాలు

**తిరుక్కోళూరు పెణ్ పిళ్ళై పలికిన 81 వాక్య రత్నాలలో అందు 8 వ భాగవతుడైన ధృవుని యొక్క వృత్తాంతమును తెలియచేస్తూ, నైచ్యాను సంధానం అవలంబి స్తున్నారు ఆమె. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలి అనే విషయాన్ని మనకు తెలియచేస్తున్నారు. "తన్షై ఎంగై ఎన్డేనో, తురువనైప్పోలే"**



**శ్రీమతి మహాలక్ష్మీ రాణి గుండు, రాజమండ్రి.**

స్వాయంభువ మనువుకు, శతరూప అనే భార్య వలన, ప్రియపుత్రుడు, ఉత్తానపాదుడు అనే ఇద్దరు కుమారులు కలిగారు. వారిలో ఉత్తానపాదుడికి సునీతి, సురుచి అని ఇద్దరు భార్యలు. పెద్ద భార్య సునీతి కుమారుడు ధ్రువుడు. చిన్న భార్య సురుచి కొడుకు పేరు ఉత్తముడు. ఉత్తానపాదుడు చిన్న భార్య సురుచి యందు ప్రేమను ఎక్కువగా చూపేవాడు.

ఒకనాడు ఉత్తానపాదుడు చిన్న భార్య కుమారుడు ఉత్తముని తన తొడపై కూర్చుండ బెట్టుకుని ధ్రువుడిని దగ్గరకు తీసుకోలేదు. అప్పుడు సురుచి గర్వంగా సవతి కొడుకును చూచి నా కడుపున పుట్టిన వాడికి తండ్రి ఒడిలో కూర్చునే అర్హత ఉంటుంది. నీవు విష్ణుదేవుని ప్రార్థించి నా కడుపున పుట్టాలని కోరుకో! నీ కోరిక నెరవేరుతుంది అంటుంది. బిగ్గరగా ఏడుస్తూ కన్నతల్లి వద్దకు చేరాడు ధ్రువుడు. ఆమె కుమారుని బుజ్జగించి విషయం తెలుసుకుని ఏ దిక్కులేని వారికి శ్రీహరియే దిక్కు. మీ తాతగారైన స్వయంభువ మనువు వలె ఆ దేవదేవుని పాదాలను ఆశ్రయించు నీ కోరిక నెరవేరుతుంది అంటుంది తల్లి. వెంటనే పట్టణము నుండి బయటకు వచ్చేశాడు మనసు ధృఢ పరచుకొని ధ్రువుడు. దివ్యదృష్టితో విషయాన్ని తెలుసుకున్న నారద మహర్షి అతని వద్దకు వచ్చి ఆశీర్వదించి మీ తల్లి చెప్పిన యోగమార్గం అతి కఠినమైనది నీవు ఆటపాటలతో గడపవలసిన పసివాడవు. ఈ ప్రయత్నం విరమించుకో మోక్షం మీద కోరిక ఉంటే ముసలితనంలో ప్రయత్నించు అన్నాడు. వెంటనే ధృవుడు "స్వామి ఎవ్వరూ పొందని స్థానాన్ని పొందాలని ఆశపడుతున్నాను నాకు చక్కని ఉపాయాన్ని తెలియజేయండి" అనగా నారదుడు ఆ నారాయణుడే నిన్ను మోక్షమార్గం పొందాలని ప్రేరేపించి ఉంటాడు. కనుక శ్రీ మహావిష్ణువుని సేవించు అని యమునా నది ఒడ్డున గల మధువనానికి వెళ్ళి స్థిరమైన మనసుతో శ్రీహరిని ధ్యానించు అని చెప్పి "ఓం నమో వాసుదేవాయ" అన్న వాసుదేవ మంత్రాన్ని ఉపదేశించాడు నారద మహర్షి.

అప్పుడు ధృవుడు నారదునకు ప్రదక్షిణం చేసి నమస్కరించి మధువనానికి బయలుదేరి వెళ్ళాడు. ఆపై నారద మహర్షి ధ్రువుని తండ్రి అయిన ఉత్తానపాదుని వద్దకు వెళ్లాడు. రాజుగారు మహర్షిని సేవించి ఉన్నతాసనంపై ఆసీనులు గావించారు. కానీ రాజుగారి ముఖం కళతప్పి ఉండటం చూసిన మహర్షి "రాజా నీ విచారానికి కారణం ఏమిటి?"అని అడగగా రాజు నా ఐదేళ్ల బాలుడైన కుమారుని అవమానించాను. వాడు అలిగి ఇల్లు వదిలి వెళ్ళాడు. అని బాధపడుతున్న రాజును చూసి మహర్షి "రాజా! నీ కుమారుని నారాయణుడు రక్షించాడు దుఃఖించకు! నీ కుమారుడు విష్ణువును సేవించి సమస్తదిక్పాలకులు పొందలేని నిత్యపథాన్ని పొందుతాడు. తొందరలోనే మీ వద్దకు వస్తాడు నీ కీర్తిని కల్పాంతం వరకు ఉండేటట్లుగా చేస్తాడు" అని చెప్పి వెళ్లిపోయాడు మహర్షి.

ధృవుడు మధువనం ప్రవేశించి యమునలో ముందుగా స్నానం చేసి ఒంటికాలిపై నిలిచి ఏకాగ్రమైన మనస్సుతో సకల సృష్టికి కారణభూతుడైన ఆ భగవంతుని ధ్యానించాడు. నియమంతో తన శ్వాసను బంధించి భగవంతునితో అనుసంధానం చేశాడు. ఈ విధంగా శ్వాసను (నిరోధించుట) బంధించుటవలన శ్రీహరి కంపించిపోయాడు. ఆయన కంపించగానే లోకాలన్నీ కంపించాయి. ఈ విపత్తును తొలగించమని దిక్పాలకులంతా లోకరక్షకుడైన విష్ణుమూర్తిని ప్రార్థించారు. అంత దేవతలకు అభయం ప్రసాదించి శ్రీహరి గరుడ వాహనము అధిరోహించి మధువనానికి వెళ్ళాడు.

(సశేషం)

# వరాహావతార ప్రయోజనం



శ్రీమాన్ శ్రీ కలకుంట్ల వరప్రసాదాచార్యులు

(క్రిందటి సంచిక తరువాయి)

వరాహస్వామి వేదాల్లో శృతి స్మృతి ఇతిహాస పురాణాల్లో అన్నింటా స్తుతించబడతాడు. ఈ స్వామిని భూవరాహ అని, శ్వేత వరాహ స్వామి అని, ఆది వరాహ స్వామి అని, యజ్ఞ వరాహ, నృసింహ వరాహ స్వామిగా అభివర్ణిస్తారు. మంచి గ్రహస్థితిని మోక్షాన్ని కూడా ప్రసాదించే వాత్సల్య సీమ మన వరాహస్వామి. విద్యావరాహంగా విశేషంగా మన సంప్రదాయాల్లో 'జ్ఞానప్పిరాను'గా వ్యవహరిస్తారు. నమాళ్వార్లు తమ తిరువాయిమొళి గ్రంథంలో 2-8-7 'కిడందిరిందు నిన్నలందు కీళలాయ్ కీళ...' అనే పాశురంలో భగవంతుడు పడుకోవడం కూర్చోవడం నిలుచోవడం ఈ భూమిపైనే చేస్తాడు. భూమిని బలి చక్రవర్తి అపహరించి నప్పుడు త్రివిక్రమునిగా అవతరించి ఆ భూమిని పొంది కాచాడు. హిరణ్యాక్షుడు అనే రాక్షసుడు నీటిలో ముంచితే దానిని వరాహ స్వామిగా ఉద్ధరించాడు. ప్రళయ సమయంలో భూమిని తన ఉదరంలో పెట్టుకొని మరల సృష్టిచేస్తాడు. దీనినే భూకక్షలో ఉండే మన జీవులందరినీ కాపాడే ప్రక్రియగా అభివర్ణిస్తారు. తమకు జ్ఞానాన్ని అందించిన స్వామిగా నమ్మాళ్వార్లు వరాహస్వామిని గురించి పాడుతారు. ఇలా జ్ఞానప్పిరాన్ అని స్తుతిస్తారు. అలాగే పెరియాళ్వార్ తమ ప్రబంధంలో ఆచార్యులుగా కీర్తిస్తారు



"గురుముఖ మనధీత్యా ప్రాహవేదాన శేషాన్" అని పాండ్య రాజ్యసభలో ఆనాడు ప్రతివాదులను ఓడించి పరతత్వాన్ని నిర్ణయించి శ్రీమన్నారాయణుడే సకల జగత్తుకు సంరక్షకుడు అని నిరూపించారు. తాము ఆచార్యుల సన్నిధిలో అధ్యయనం చేయకున్నా ఎలా పరతత్వాన్ని నిర్ణయించారు ఆ రహస్యాన్ని తెలుపుతారు. "ఎయిఱ్ఱై మణ్ కొండ ఎందై ఇరాప్పకల్ ఓదువిత్తు ఎన్నై పయఱ్ఱి ప్పణి శెయ్యక్కొండాన్" తన దంతంతో భూమిని ఉద్ధరించిన వరాహస్వామి తన తండ్రి రాత్రి పగలు అధ్యయనం చేయించి నాతో తన కైంకర్యం చేయించుకున్నాడు అని స్తుతించారు.

కర్మ జ్ఞాన భక్తులతో సాధించవలసిన మోక్షం కలగాలనే లక్ష్యాన్ని ప్రతి జాతికి శాస్త్రం తెలుపుతుంది. దానిలో ఎన్ని గ్రంథాలు ఎలా తెలిపినా శ్రీవైష్ణవ సాంప్రదాయంలో భగవద్రామానుజులను ఆశ్రయించి ఏ జన్మలో శరణాగతి చేస్తున్నామో అదే చివరి జన్మ. ఆ శరీరాన్ని విడిచి అర్చిరాది మార్గంలో ప్రయాణం చేసి శ్రీవైకుంఠం చేరి అంతులేని ఆనందాన్ని పొందుతాము. ఏనాడో మనం చేసిన శరణాగతి మనం మరచినా తన మనసులో పెట్టుకొని ఉంటాడు. మరణ సమయంలో చేయలేని, ఆరోగ్యం సహకరించని సమయంలో "అప్పొదుక్కు ఇప్పొదే శొల్లి వైత్తేన్" అని చెప్పినట్లుగా ప్రాణంపోయే సమయంలో భగవతున్ని ధ్యానించటం మరచినా వరాహస్వామి మరువకుండా మోక్షానికి తీసుకు వెళతాడు. ఇదే విషయాన్ని కంచి వరదుని ద్వారా తిరుక్కచ్చినంబి శ్రీముఖంగా భగవద్రామానుజులు తెలుసుకున్న 6 వార్తలలో ఇది ఒకటి.

**అంతిమ స్మృతివర్జనం**

"స్థితే మనసి సుస్వస్థే" వరాహ చరమ శ్లోకం. కృష్ణ వరాహ అవతారాలలో ప్రయోజనం శరణాగతిని నేర్పించడమే. శరీరం సహకరించి ధాతుపుష్టిగా ఉన్న రోజుల్లో తనను స్మరిస్తే మరణశయ్యపై రాయిలా ఉన్న అతనిని నేను స్మరిస్తూ నా భుజస్కంధంలో మోస్తూ పరమపదానికి తీసుకువెళ్తాను అని ఉపదేశిస్తాడు వరాహస్వామి. ★



# భాగ్యాల బతుకమ్మ


తెలంగాణ సమిష్టి సంస్కృతి ప్రతీక బతుకమ్మ పండుగ. ప్రాచీన తెలంగాణా సామాజిక జీవనాన్ని, శోభను, పరిసరాలను ప్రతిబింబించే పూల పండుగ. తెలంగాణ ప్రాంతంలో బోనాలు, బతుకమ్మ పండుగ అనేవి అంతర్లీనంగా ఏ సాంప్రదాయ రీతిగా భావించినను మహాలక్ష్మీ ఆరాధనగా అందరూ భావిస్తారు. వైదిక పౌరాణిక ఆచారాల ద్వారా అనేక పండుగలు జరుపుకుంటాము చారిత్రిక మరియు విశ్వాసాల ఆధారంగా పరంపరాగత ఆచారంగా బతుకమ్మ పండుగను జరుపుకుంటున్నాము.



శ్రీచక్ర స్వరూపమును పోలిన రూపంతో సహజమైన పువ్వులతో బతుకమ్మను పేర్చి అమ్మవారి స్వరూపంగా భావించి పూజిస్తారు. అమావాస్య నుండి తొమ్మిది రోజులు ఆటపాటల ద్వారా ఆరాధిస్తూ బతుకమ్మ ఆడే ఈ విధానం అత్యంత రమణీయం! పసుపుతో గౌరీదేవి లేక లక్ష్మీదేవి రూపంగా చేసి పూజిస్తారు. ఆ పసుపును బతుకమ్మను నీటిలో అంపిన తర్వాత ముత్తైదువలు వాయినాలు ఇచ్చుకొని ధరిస్తారు. మంచి బతుకును సౌభాగ్యాన్ని ప్రసాదించమని అమ్మవారిని ప్రార్థిస్తారు.

మొదటిరోజు ఎంగిలిపూల బతుకమ్మగా చివరి రోజు సద్దుల బతుకమ్మగా ఒక్కో రోజు ఒక్కో పేరు చెబుతూ ఆయా పదార్థాలతో నైవేద్యం సమర్పిస్తారు. దేవీ నవరాత్రులకు సమాంతరంగా సాగుతూ చివరి రోజున పెద్ద బతుకమ్మగా ఉత్సవాలు చేసి చెరువుల్లో జలాశయాల్లో అంపుతారు. ప్రకృతి నుండి పృథ్వి నుండి మనం పొందిన దానికి ప్రతిగా భక్తితో సమర్పించటం, ఆరాధించడం అనే గొప్ప సంస్కృతిని తెలియజెప్పే పవిత్రమైన పండుగ బతుకమ్మ పండుగ. మన పరిసరాల్లో పొలాల్లోనూ గట్టుల మీద మొలిచే అనేక ఔషధీ మొక్కలు పువ్వులను స్పృశించడం ఆరాధించడం వలన ఈ

పండుగలో పరమార్థం తెలియకపోయినా ఆరోగ్యాన్ని ఆనందాన్ని ఆహ్లాదాన్ని కూడా మనము పొందుతాము. "భాగ్యాల బతుకమ్మ". భాద్రపద అమావాస్య నుండి తొమ్మిది రోజులు జరుపుకునే ఈ పండుగ ఆయా ప్రాంతాల ఆనవాయితీ ననురించి సాగుతుంది. బతుకమ్మ ఉత్సవం రోజును కూడా నిర్ణయిస్తారు. అన్ని స్థాయిల కులాల స్త్రీలు కలిసి అరమరికలు లేకుండా దేవాలయాల్లో వీధి కూడళ్ళలో చెరువు గట్టులపై సమిష్టిగా లయబద్ధంగా పాడుతూ బతుకమ్మ ఆడుతారు. ఆ పాటల్లో కూడా భగవద్భక్తి, సామాజిక జీవన విధానం, కుటుంబ విలువలు కనిపిస్తాయి. కన్నుల పండుగగా జరిగే "బతుకమ్మ పండుగ" అన్ని ప్రాంతాలకు విస్తరించి, దేశ విదేశాలలోనూ అందరు భారతీయులు భక్తితో లక్ష్మీదేవి పూజగా జరుపుకునే విధంగా పరిణమించింది "భాగ్యాల బతుకమ్మ పండుగ" ★



# అష్టలక్ష్మీ వైభవం



శ్రీమతి వంగల రాధిక

లక్ష్మీదేవి సిరుల నిచ్చే తల్లి. నారాయణుడనే పరమాత్మను పొందాలంటే పిరాట్టి ఉపకారము మనకు కావాలి. అష్టవిధరూపములలో మనకు అష్టైశ్వర్యాలనుప్రసాదించే పిరాట్టి మహాలక్ష్మీదేవి అష్టవిధ స్వరూపములలో

"విజయ లక్ష్మి

పరమాత్మను చేరేందుకు మనకు ఆటంకాలై నిలబడే విరోధిస్వరూపాలు, స్వరూపవిరోధి, పరత్వ విరోధి, పురుషార్థ విరోధి ఉపాయవిరోధి, ప్రాప్తివిరోధి. ఈ ఐదు విరోధులను అధిగమించి పరమాత్మను చేరే భాగ్యాన్ని ప్రసాదించేదే విజయలక్ష్మి. ఈ లోకంలోను అన్ని ధర్మ కార్యాల్లో విజయం ప్రసాదిస్తుంది. పరమాత్మలో నివురుగప్పిన నిప్పులా వుండే దయ గుణమును ప్రేరేపించేది పిరాట్టి. రెండు విధములుగానూ పురుషకారముచేసి, మనకు విజయము సిద్ధించేలా చేస్తుంది పిరాట్టి.

"ధన లక్ష్మి"

ధన్నాన్ని ఐశ్వర్యాన్ని ఇచ్చేది ధన లక్ష్మి. అని మనకు లోకంలో వాడుక. కాని అసలైన ధనము, ఐశ్వర్యము, సంపద శ్రీనిధి అన్నీ ఆ శ్రియః పతియే! అట్టి పరమాత్మనే మనకు అందించేది పిరాట్టి! 'అంబరమే' వస్త్రాలు దానం ఇస్తే అవి వస్త్రాలు మాత్రమే. 'శోరు' అన్నము దానముచేస్తే అన్నము మాత్రమే! కానీ 'ఉక్కముం తట్టొళియుం తన్దు ఉన్ మణాలనై' నీ స్వామినే మా కీయవమ్మా అని అంటారు తిరుప్పావై ప్రబంధంలో. ఆ పరమాత్మే మనవాడైతే అటువంటి సకల సంపదలు మనవే కదా! "కరంద నర్పాలుం తయిరుం కడైందు ఉరిమేల్ వైత్త వెణ్ణె పిరందదువే ముదలాగ పెట్రరియేన్ ఎంబిరానే"

శ్రీకృష్ణ పరమాత్మ యదుకులములో ఉదయించిన తరువాతే పాలు పెరుగు వెన్న అన్నియు సమృద్ధిగా లభించాయి యాదవులకు. సకల సంపదలకు నిలయమై వెలుగొందినది గోకులము. అలాంటి పెరుమాళ్‌నే మనకు అందించేది పిరాట్టి. అందుకనే ధనలక్ష్మి అయ్యింది.

ఇలా మనకు అర్థ పంచకజ్ఞనాన్నే కాక సకల విధ సంపదలను ఒసగే తల్లిగా అష్టలక్ష్మిగా విలసిల్లింది శ్రీమహాలక్ష్మి! ప్రణవములోని అకార మకారముల మధ్య ఉకారముగా, పురుషకారిణిగా, ఉపాయ స్వరూపిణిగా విరాజిల్లింది!

ధాన్య లక్ష్మి!

సర్వ సంపదలను ఇచ్చే తల్లి. ధాన్యము ఒక సంపదే! "అన్నాద్ భవంతి భూతాని పర్జన్యాత్ ధాన్య సంభవః" సర్వ భూతములకు ఆహారమైన ధాన్య సమృద్ధిని ఇచ్చే పిరాట్టి. రెండు చేతులలో ధాన్యపు కంకులను ధరించి ఎవరూ శుష్కించి పోకుండా, అభయమిస్తూ దర్శనమిచ్చే పిరాట్టి. జీవరాసులు శుష్కించకుండా వుండాలంటే ఆహారము మనము పండించుకొనే ధాన్యము మాత్రమే కాదు. "ఓంగి వులగళంద ఉత్తమన్ పేర్ పాడి" అంటుంది ఆండాళ్ పిరాట్టి. అలా పరమాత్మ నామ సంస్మరణ చేత ఏమి వైభవము సమకూరుతుంది? "ఓంగు పెరుంశెన్నల్ వూడు కయల్ ఉగళ" శెన్నెల్ ఎర్రని పెద్ద పెద్ద కంకులు గల వడ్లు ధాన్యములు పండుతాయి. ఏపుగా పెరిగిన ఆ పైరుల మధ్య చేపలు వయ్యారంగా నడుములు తిప్పుకొంటూ ఈదుతూవుంటే, ఆ వడ్ల కంకుల భారముతో నున్న పైరు, ఆ కదలికలకు గిలిగింతలు పెట్టినట్లయి ఇటూ అటూ వూగుతూ వుంటే, ఆ కంకులమధ్య మకరందాన్ని గ్రోలడానికి చేరిన భ్రమరములు, కడుపునిండా తేనెను గ్రోలి, ఆ మత్తయిన ఆనందములో, వూయలలూగు కంకులలో హాయిగా నిద్రిస్తుంటే అంటూ ఆండాళ్ తల్లి పాడిన ప్రాకృతిక శోభ. దానిలో ఇమిడి వున్న తత్వార్థము ఏమనగా త్రివిక్రముడిగా ముల్లోకములను కొలిచిన భగవంతుని గుణ గానము, ధాన్య సంపదలో ప్రకృతి శోభలోనూ పరమాత్మను దర్శిస్తుంది. కళ్యాణ గుణములనెడి, అమృతమయములైన మకరందములు నిండిన నామ సంకీర్తనములు అను కంకులు, ఏపుగా ఎదుగునట్లుగా భగవన్నామ సంకీర్తనములు చేస్తూవుంటే, ఆ నామ సంకీర్తనముల మాధుర్యములను ఆహారముగా తీసుకొని, ఆ ఆహారపు మాధుర్యములను ఇంకా ఇంకా ఆస్వాదిస్తూ జీవులనే మీనాలు వయ్యారపు ఆనంద నృత్యములను చేస్తున్నాయి. (మిగతా వచ్చే సంచికలో)



# శ్రీరామాయణంలో ఉపకథలు

# ధర్మసూక్ష్మం తెలిసిన శునకం



**శ్రీమతి చక్రవర్తుల చూడామణి, ఖమ్మం**

రామాయ రామభద్రాయ రామ చంద్రాయ వేధసే।
రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః॥

శ్రీమన్నారాయణుడు రాముడుగా అవతరించాడు. వేదం రామాయణంగా అవతరించింది. అందువలన వేదంలో చెప్పబడిన అనేక ధర్మాలు రామాయణంలో ఉన్నాయి.


ఒక మంచి రాజుకు ఉండవలసిన లక్షణాలు, మఠాధిపతి అనుసరించాల్సిన ధర్మాల గురించి ధర్మ సూక్ష్మం బాగా తెలిసిన ఒక కుక్క రాముడి సభలో చెప్పిందట. అంటే రాముడు పరిపాలించిన కాలంలో మనుష్యులకే కాదు పశు పక్ష్యాదులకు కూడా ధర్మ సూక్ష్మం తెలుసు అని అర్థం అవుతుంది. గృహస్థ ధర్మం పాటించి ప్రాణ త్యాగం చేసిన కపోతం గురించి మునుపే చెప్పుకున్నాం. ఇప్పుడు ధర్మ సూక్ష్మం బాగా తెలిసిన సారమేయుడు అనే కుక్క గురించి తెలుసుకుందాం. రాజీవలోచనుడైన శ్రీరాముడు సభలో కొలువై ఉన్నాడు. వసిష్ఠ, కశ్యపాది మంత్రులు, ప్రముఖులు ధర్మశాస్త్రాలలో ఆరితేరిన పలువురు పెద్దలు, నీతి శాస్త్ర కోవిదులు, దక్షతగల మంత్రులు, సామంతులు అందరూ సభలో ఉన్నారు. రాజులలో ప్రముఖుడైన శ్రీరాముడు అప్పుడు లక్ష్మణుడిని చూసి కార్యార్థిగా వచ్చిన వాళ్ళు ఎవరైనా ద్వారం దగ్గర ఉన్నారేమో చూసి రమ్మని ఆజ్ఞాపించాడు. లక్ష్మణుడు ద్వారం దగ్గరకు వెళ్ళి చూశాడు. అక్కడ ఎవరు కనబడలేదు. రాముడి దగ్గరికి వచ్చి ఆ విషయం తెలియజేశాడు. రాముడు మళ్లీ ఇంకొకసారి ద్వారం దగ్గరకు వెళ్లి చూసి రమ్మన్నాడు. లక్ష్మణుడు రెండవ సారి ద్వారం దాకా వెళ్ళి చూసాడు. అక్కడ ఒక కుక్క పదే పదే మొరుగుతూ కనపడింది. లక్ష్మణుడు ఆ కుక్కను చూసి 'నీకేం కావాలి?' అని అడిగాడు. 'ధర్మ ప్రభువైన శ్రీరాముడితో నేను స్వయంగా మాట్లాడాలి' అని ఆ కుక్క చెప్పింది. లక్ష్మణుడు వెంటనే లోపలికి రమ్మని పిలిచాడు. కానీ ఆ కుక్క వెంటనే లోపలికి వెళ్ళడానికి ఒప్పుకోలేదు. ఎటువంటి సభకు ఎవరు వెళ్ళవచ్చు, ఎవరు వెళ్లకూడదు అనే నియమం ఎప్పుడూ ఉంటుంది. రాజు కొలువై ఉన్న సభలోకి రాజు అంగీకారం లేకుండా ప్రవేశించకూడదు. అలా ప్రవేశించడం ఉభయులకు మర్యాద కాదు. ఇక్కడ ఈ కుక్క అదే విషయాన్ని లక్ష్మణుడితో చెప్పింది. 'అలా నేను రాలేను, దేవ మందిరంలో, రాజసభలో, బ్రహ్మణుడి గృహంలో అగ్ని, ఇంద్రుడు, సూర్యుడు, వాయువు మొదలైన దేవతలు ఉంటారు. శ్రీరాముడు ధర్మ స్వరూపుడు, అధమ జాతికి చెందిన ప్రాణులకు అందులో ప్రవేశించే అర్హత లేదు. ఆయన సంధి, విగ్రహ, యాన, ఆసన, ద్వైదీభావ, సమాశ్రయణం అనే ఆరింటిని ఉపయోగించే శక్తి కలవాడు. ఆయన సర్వజ్ఞుడు, భూత భవిష్యత్తు తెలిసినవాడు. ప్రజారంజకుడైన గొప్ప పరిపాలకుడు. ఆయన ఆజ్ఞ లేకుండా నేను లోపలికి రాలేను. ఇలాంటి సభలోకి రాముడు అంగీకరిస్తేనే నేను వస్తాను. అని స్పష్టం చేసింది. లక్ష్మణుడు సభలోకి వెళ్ళి రాముడికి ఈ విషయాన్ని తెలియజేశాడు. వెంటనే రాముడు ఆ కుక్కని ప్రవేశపెట్టమని అనుజ్ఞ ఇచ్చాడు. ఆ కుక్కను లోపలికి తీసుకెళ్లారు. 'నువ్వు చెప్పదలచుకున్నది నిర్భయంగా చెప్పు' అని అన్నారు.

అప్పుడు ఆ శునకం రాముడిని చూసి ఇలా చెప్పింది 'నా పేరు సారమేయము. సమస్త ప్రాణులకు రాజే సర్వాధికారి, ప్రజలందరినీ సన్మార్గంలో నడిపించే వాడు. ప్రజలు నిద్రావస్థలో అంటే అమాయక స్థితిలో ఉన్నప్పుడు ప్రభువు జాగ్రత్తగా, జాగరూకుడై వాళ్ళని పరిపాలిస్తూ ఉంటాడు. ప్రజల మంచి చెడ్డలకు రాజు కర్త, వారిని రక్షించే వాడు. అతడి రాజ్యంలో ప్రజలకు రాజు కాల పురుషుడు, యుగపురుషుడు ఆ దేశానికి, ప్రజలకు ఆయనే సర్వస్వం. రాజు పరిపాలన కుంటుపడితే ప్రజలు కష్టాల పాలవుతారు. జగత్తును ధరించేది కాబట్టి ధర్మం అని పేరు. చరాచర ప్రాణులతో కూడిన ముల్లోకాలలోను ధర్మమే ప్రజలు సురక్షితంగా ఉండడానికి కారణం. (సశేషం)

# జీవుడు కర్మను స్వతంత్రుడై చేస్తాడా?

## లేక పరమాత్మే జీవుడిచేత అన్నికర్మలనీ చేయిస్తాడా?

(శ్రీమాన్ పుత్తూర్ కృష్ణమాచార్యస్వామివారి వ్యాఖ్యానానుసారంగా చెప్పబడినది)



**శ్రీమాన్ శ్రీ శ్రీభాష్యం శ్రీనివాసాచార్యులు**

జీవుడు కర్మను చెయ్యటం గురించి శ్రీభగవద్గీతలో 18వ అధ్యాయంలో 14,15 శ్లోకాలలో ఉన్నది. ఆ విషయాన్ని గురించి చెప్పుతూ "తథా కర్తా పృథగ్విధం కరణం చ వివిధా పృథక్చేష్టా చ అత్ర పంచమం దైవం చ ఏవ" అలాగే జీవాత్మ, అదేవిధంగా పలువిధాలైన కర్మలుగల మనస్సుతోపాటు అయిదు కర్మేంద్రియాలు, అలాగే ఐదువిధాలైన కర్మలుగల ప్రాణము, ఈ కర్మలకి కారణమైనవాటిలో, అయిదవదిన్నీ, ముఖ్యమైన కారణమైనదిన్నీ అయిన పరమాత్మే అని చెప్పబడింది. కర్మలన్నింటికీ కారణమైయుండటంకంటే పరమాత్మ అయిన అంతర్యామి కర్మలను నెరవేర్చటానికి ముఖ్యకారణమని భావం. అయిదు కారణాలను చెప్పుతున్నప్పుడు "అత్ర" అని దీనిని చెప్పి ఉండడంచేత, పంచమమ్ (అయిదవది) అని లెక్కని చెప్పటానికి శ్రుతిక్రమం, అర్థక్రమం, పాఠక్రమం, మొదలైన మరేకారణమే లేనందున దైవమైన ఇది ముఖ్యమైన కారణమని తెలుపబడుతున్నది అని గ్రహించాలి. "తం ఆత్మపంచమం దృష్ట్వా" (సహాయకులైన నలుగురితోకలిసి) తాను అయిదవవాడైన ఆ విభీషణడిని చూచి అన్నట్లు ఆ మిగతా నలుగురి ఉనికి తన అధీనమయే ప్రాధాన్యం గలవాడు అని శ్రీవిభీషణుడిని చెప్పేటప్పుడు, "ఆత్మపంచమమ్" అని శ్రీవాల్మీకి చూపించాడు. కఠోపనిషత్తులో "ఇంద్రియేభ్యః పరాహ్యర్థా" అని ప్రారంభించి "మహతః పరమవ్యక్తం అవ్యక్తాత్ పురుషః పరః। పురుషాత్ పరం కించిత్ సా కాష్ఠా సా పరా గతిః॥" అని చేతనుడిచేత వశపరుచుకొనవలసినవాటి వరుసని చెప్తున్నప్పుడు ఇంద్రియాలని మొదట ఎత్తుకొని, పరమపురుషుడిని చివరగా ఎత్తుకొనటంద్వారా ఇంద్రియాది సమస్తమైన వాటి క్రియా కర్తృత్వానికీ పరమాత్మే ముఖ్యకారణము అని. వశంలో ఉంచుకొనేవాటిలో చిట్టచివరివాడు అని చెప్పబడినట్లు ఇక్కడకూడా చివరివాడుగా చెప్పబడిన దైవం ముఖ్య కారణమని చూపుతున్నది.

ఇక్కడ ఒక ఆక్షేపం వస్తున్నది. "దైవం పురాకృతం కర్మ"(పూర్వం చేసిన కర్మ "దైవం" అనబడుతున్నది), "దైవం, దిష్టం, భాగధేయం, భాగ్యం" (అమరకోశం) దైవం, దిష్టం, భాగధేయం, భాగ్యం మొదలైన పదాలు పూర్వం చేసిన పుణ్యపాపాలని చెప్పుతున్నవి. నిఘంటువులలో పూర్వకర్మలైన భాగ్యాన్ని చెప్పుతున్నట్లు "దైవ" శబ్దం చెప్పబడియున్నది.

చేతనుడు చేసే కార్యాలకు పూర్వం చేసిన కర్మలు కారణమైనాయి అనేవిషయంకూడా తగినదే అవుతుంది. కనుక, 'దైవ'శబ్దానికి పరమాత్మ అని ఇక్కడ అర్థం చెప్పటం ఎలా కుదురుతుంది? అని ఆక్షేపం. దీనికి సమాధానం – చేసినవెంటనే నశించిపోయే పుణ్యాపాపకర్మలు మనుష్యుడు చేసే కార్యాలకి ప్రత్యక్షంగా కారణమౌతాయి అని చెప్పటం కుదరదు. కనుక, ఆ కర్మంచేత కలిగే పరమపురుషుడి ప్రీతి,కోపాలవల్ల కలిగే సంకల్పమే మనుష్యుడు చేసే కర్మలకి కారణమని చెప్పాలి. ఈ విధంగా పరమపురుష సంకల్పాన్ని 'దైవ'శబ్దంచేత చెప్పటం తప్పు, ఆ సంకల్పం చేసే పరమపురుషుడినే 'దైవ' శబ్దంచేత చెప్పటం శ్రేష్ఠం. లోకంలోనూ, శాస్త్రాల్లోనూ 'దైవ' శబ్దం దేవతని చెప్పేదిగా వాడకంలో ఉన్నది.

"సత్యం సత్యం పునస్సత్యం ఉద్ధృత్య భుజముచ్యతే।
వేదాచ్ఛాస్త్రం పరం నాస్తి న దైవం కేశవాత్ పరమ్॥"
(నారసింహపురా) మూడుసార్లు సత్యం అని చెప్పటం. చేతులెత్తి చెప్పుతున్నాను. వేదంకంటే గొప్పదైన శాస్త్రం లేదు, కేశవుడికంటె గొప్పదైన దైవం మరొకటి లేదు. అనే శాస్త్రవచనంలో దైవశబ్దానికి పరమాత్మయే తిన్నగా ముఖ్యార్థంగా ఉన్నాడు గదా! శ్రీమద్రామాయణంలోకూడా "స్వాధీనం సమతిక్రమ్య మాతరం పితరం గురుమ్।
అస్వాధీనం కథం దైవం ప్రకారైరభిరాధ్యతే॥" (రా. అ)

మన కంటికి కనబడుతూ మనచేత ప్రత్యక్షంగా ఆరాధించబడే తల్లితండ్రి, ఆచార్యుడికంటె మనకి కనపడని దైవాన్ని ఆరాధించటం ఎట్లు తగును? (సశేషం)

శ్రీసంప్రదాయ సేవలో

# ఉభయ వేదాంత పండిత పరిషత్






కలియుగంలో యుగ ధర్మము చేత పరమార్థాన్ని మరిచి అనేక దుఃఖాలను పొందుతున్న సామాజికులను ఉద్ధరించడానికే భగవత్ రామానుజాచార్యులు ఆదిశేషాంశ సంభూతులై జగదాచార్యులై అవతరించారు. వేద, ఆగమ, పురాణేతిహాసముల, మరియు ఉపనిషత్తులకు, బ్రహ్మసూత్రములకు, భగవద్గీతకు ఏక కంఠాన్ని కలిగించే సిద్ధాంతాన్ని వారు వెలయించారు. వేదోపనిషత్ సారమై, ఆళ్వారుల ద్రావిడ ప్రబంధ దివ్య సూక్తి సారముగా, ఆవిర్భవించినది రామానుజ మార్గము. అందుకే అది ఉభయ వేదాంతసారమై ప్రసిద్ధిగాంచినది. సకల కళ్యాణ గుణములు గల పరమాత్మ తత్వాన్ని ఎరుకపరిచి పరమార్థాన్ని పామరులకు కూడా కరతలామలక మొనర్చి వేయి సంవత్సరాలకు పైగా శాశ్వతముగా శుభాలను కలిగిస్తూ నిలిచినది విశిష్టాద్వైత సిద్ధాంతము. శ్రీవైష్ణవము అను పేరుతో ప్రసిద్ధి పొందిన ఈ సిద్ధాంత ప్రచార లక్ష్యంతో లోక కళ్యాణం కొరకు స్థాపించబడినది ఉభయ వేదాంత పండిత పరిషత్. సనాతన వైదిక ధర్మాన్ని సప్రమాణికంగా విస్తృతంగా వ్యాప్తి చేయటానికి “ఉభయ వేదాంత పండిత పరిషత్” కృషి చేస్తున్నది.

వేయి సంవత్సరముల తర్వాత నేటికినీ మహా వైభవముతో ఆయా ఆచార్యుల సంకల్పంతో ఫలవంతమై వర్ధిల్లుతున్నది శ్రీ సంప్రదాయము. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామివారి మంగళాశాసనములతో 2019 సంవత్సరమున అనేక మంది ఉభయ వేదాంత పండితుల, సాంప్రదాయపరుల కృషితో భాగ్యనగరంలో ఆవిర్భవించినది ఉభయ వేదాంత పండిత పరిషత్. శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయము సైదాబాద్ కాలనీ హైదరాబాదు నందు ప్రధాన కార్యస్థానముగా కార్యక్రమములు నిర్వహింప బడుచున్నవి. ప్రధానంగా శ్రీమదుభయ వేదాంత పండిత పరిషత్తు ముఖ్య ఉద్దేశములు:



ఉభయ వేదాంత ప్రవచనములు సభలు సమాలోచనలు సదస్సులు చర్చాగోష్ఠులను నిర్వహించుట.

భగవత్ సన్నిధులను సంప్రదాయ ప్రచార కేంద్రములుగా తీర్చిదిద్దుట

యువతి యువకులను సాంప్రదాయ ఆచరణకై ప్రోత్సహించుట, అనుబంధ కార్యక్రమములు నిర్వహించుట.

భవిష్యత్తుకు సాంప్రదాయ వక్తలను రూపొందించుట. వర్తమానంలో వక్తలను ప్రోత్సహించుట.

జిల్లా శాఖలు ఏర్పాటు చేసి కార్యక్రమములు నిర్వహింపచేయుట.

పరిషత్తు ద్వారా పండితుల ప్రవచనములు ఏర్పాటు చేయించి జూమ్ ఆప్, భాషకార ఛానల్, యూట్యూబ్ లైవ్ ద్వారా సాంప్రదాయ గ్రంథ రహస్యములను అధ్యయనం చేయించుట. ప్రవచనాలు చెప్పించుట.

అముద్రిత, అలభ్య సాంప్రదాయ గ్రంథములను అందుబాటులోకి తెచ్చుట.

పూర్వాచార్య వ్యాఖ్యానములను సరళముగా తెనిగింపజేయుట.

దివ్యదేశ యాత్రలు నిర్వహించుట.

తిరుప్పావై శిక్షణా శిబిరముల నిర్వహణ ద్వారా ప్రవచనకారులను తయారు చేయుట.

భగవత్ ఆళ్వార్ ఆచార్య తిరునక్షత్రోత్సవముల నిర్వహణ.

పూర్వాచార్యుల రహస్య గ్రంథముల భావములకు విఘాతము కలగకుండా ధర్మ ప్రచారము గావించుట.

సమస్త ప్రజల ఉజ్జీవనయే ధ్యేయంగా ధర్మాభివృద్ధికి పాటుపడుట. అందరిని సభ్యులుగా చేర్చుకొని సమన్వయింపచేయుట.

సభ్యత్వ రుసుము ద్వారా సభ్యులుగా చేర్చుకొనుట. పైన తెలుపబడిన లక్ష్యములను ప్రధానంగా చేసుకొని అనేక కార్యక్రమములను. 5 సంవత్సరములుగా ఉభయ వేదాంత పండిత పరిషత్ నిర్వహించుచున్నది.నేటి ఉభయవేదాంత పండిత పరిషత్ కార్యవర్గ సభ్యులు

గౌరవ సలహామండలి:

శ్రీ.ఉ.వే. శ్రీమాన్ కందాడై రామానుజాచార్యులు

శ్రీ. ఉ.వే.శ్రీమాన్ శిరశినహల్ వేంకటాచార్యులు

శ్రీ ఉ.వే. శ్రీమాన్ అప్పనకన్డాడై పెరుమాళ్ళాచార్యులు

శ్రీ ఉ.వే. శ్రీమాన్ సుదర్శనం శ్రీనివాసాచార్యులు

అధ్యక్షులు శ్రీ ఉ.వే. కండ్లకుంట వేంకటనరసింహాచార్యులు

ఉపాధ్యక్షులు: శ్రీమాన్ సేనాపతి నిర్గుణాచార్యులు

కార్యదర్శి: శ్రీమాన్ చించాపట్టణం జగన్మోహనాచార్యులు

సహాయకార్యదర్శి: శ్రీమాన్ ఎన్.సి.వి. నరసింహాచార్యులు

శ్రీమాన్ సుదర్శనం శ్రీనాథస్వామి

కోశాధికారి: శ్రీమాన్ దరిపల్లి సురేష్ ఆచార్యులు

కార్యనిర్వాహకసభ్యులు: శ్రీమాన్ అప్పన్ కన్డాడై శ్రీనివాసాచార్యులు, శ్రీమతి కందాడై స్వర్ణకుమారి ధర్మపురి.

ఉభయ వేదాంత సభలను, శ్రీ రామాయణ ప్రవచనములను తిరుప్పావై సదస్సులనే గాక భగవద్విషయము, శ్రీ భాష్యం గ్రంథమును నాలుగు భాగములుగా ప్రచురించినది. ఇంకా గ్రంథములు ముద్రణలో ఉన్నవి. పూర్వాచార్య కృత సాంప్రదాయ గ్రంథములను ఆన్లైన్ ద్వారా ప్రవచనములను కూడా నిర్వహించుచున్నది. సదా సాంప్రదాయ సేవలో వైదిక ధర్మ ప్రచార, పరిరక్షణకై కృషి చేస్తున్నది ఉభయవేదాంత పండిత పరిషత్. ★

## భాగవతంలో భగవంతుని అవతార గాథలు


(12వ పేజీ తరువాయి) ఈ అన్ని విషయాలలోనూ మన్నిస్తారు. సనకాదుల మైన మేము, నారాయణ ధ్యానతత్పరులం. ధర్మానుగాములం. ఈ భావంతో మమ్ములను భావించినవారికి మేలు చేస్తుంటాము. నీవు భృగువంశంలో పుట్టినవాడివి. నా దర్శనం కొరకు తపస్సు చేశావు కావున, నీకు ప్రసన్నుణ్ని అయ్యాను. ఏం కావాలో కోరుకో!" అన్నాడు.

మార్కండేయుడు పర మానందభరితుడై, తనకు పితృదేవతా ప్రభావాన్ని తెలియజేయ మని ప్రార్థించాడు.

అప్పుడు సనత్కుమారుడు, "పూర్వం బ్రహ్మదేవుడు తనకు సంతోషం కలిగించే యజ్ఞాలు చేస్తారని దేవతలను సృజించాడు. వారు ఆ పని చేయకపోతే, వారి తత్త్వజ్ఞానం పోతుందని శపించాడు. దేవతల పతనంతో ముల్లోకాలూ మోహసముద్రంలో మునిగాయి. దేవత లందరూ విరించి వద్దకు వెళ్లి శరణు వేడారు. అప్పుడు బ్రహ్మ వారిని ఆదరించి, "ఓ దేవతలారా! మీ మీ తప్పులకు ప్రాయశ్చిత్తాలను మీ మీ కుమారులను అడిగి తెలుసుకొని, ఆ విధంగా నడచుకోండి. అప్పుడు మీరు కోల్పోయిన జ్ఞానం మీకు ప్రాప్తిస్తుంది" అని చెప్పి పంపించాడు. (సశేషం) ★



# ఋషి వాక్య ప్రబోధాలు



శ్రీమాన్ శ్రీ డా.యం.టి.ఆళ్వార్ స్వామి

అరావపి ఉచితం కార్యం ఆతిథ్యం గృహ మాగతే।
ఛేత్తు మప్యాగతే చ్ఛాయాం నోప సంహరతే ద్రుమః॥
(శ్రీమహభారతే శాంతిపర్వ 186-5)

మన ఇంటికి వచ్చిన అతిథి నీకు శత్రువైనా సరే, ఆదరించి ఆతిథ్యం ఇవ్వాలి. సృష్టిలోని చెట్టు తనను నరకడానికి వచ్చిన వాడికి కూడా నీడను ఇస్తుంది కాని మానుకోదు కదా!.

శతహస్త సమాహర
సహస్రహస్త సంకిర।
కృతస్య కార్యకస్య
చేహస్ఫాతిం సమావహా॥

నూరు చేతులతో సంపాదించుకో కాని వేయి చేతులతో దానం చేయుమా!

అధర్వవేదం, 3వ కాండ, 5వ అనువాకం, 24వ సూక్తం, 5వ మంత్రం

క్షుదితే నిత్యం అన్నం వై
దదత్ శ్రద్ధా సమన్వితః।
బహ్మహత్యాదికం పాపం
అన్నదః చాప కర్షతి॥ (పద్మ పురాణం 19)

ఆకలితో నున్న వారికి నిత్యం శ్రద్ధగా అన్నం ఎవరు పెడతారో వారికి బ్రహ్మహత్యాది పాపాలు నశిస్తాయి.

హృషీకా ణీంద్రియా ణ్యాహుః
తేషా మీశోయతో భవాన్।
హృషీకేశ స్తతో విష్ణో
ఖ్యాతో దేవేషు కేశవ॥ (మహాభారతం)

హృషీకములు అనగా ఇంద్రియాలు, వానిని నియమించు వాడు హృషీకేశుడు అనగా శ్రీహరి అని అర్థం. అందువలననే హృషీకేశుడని "శ్రీకృష్ణుడు" పేరుగాంచినాడు. హృషికేశ క్షేత్రమే నేడు ఋషీకేశ్ అని వాడుకలోనికి వచ్చినది

మాతాపితృ సహస్రాణి
పుత్రదార శతానిచ।
సంసారేష్వనుభూతాని
కస్య తే కస్య వా వయమ్॥

ఈ సంసారంలో మనకు జన్మ జన్మాంతరాలలో ఆయా కర్మల ఫలితంగా వేలకొలది తల్లిదండ్రులు, భార్యాపుత్రాదులు లభించారు. నిజానికి ఈ జీవులలో దేహానంతరము వారు ఎవరికి ఎవరౌతారు? మనం ఏమౌతాం! అనేది సత్యవాక్యము దీనిని తెలుసుకుంటే బాంధవ్యాలపట్ల వ్యామోహం తగ్గుతుంది. ఇది వ్యాసుల వారి మాట.

న్యాయార్జితం స్వల్పమపి
కాలే దత్తం యుధిష్ఠిర।
మనసా సువిశుద్ధేన
ప్రేత్యానంత ఫలం స్మృతమ్॥

మనం న్యాయార్జితంగా సంపాదించిన ధనాన్ని కొద్దిగానైనా, మంచి మనసుతో దేశ, కాల, పాత్రతను తెలుసుకొని దానం చేస్తే అనంతమైన ఫలాన్ని ఇస్తుంది. ఈ రహస్యం "ముద్గల మహర్షి జీవిత సారాంశంగా మహాభారతం వనపర్వంలో చెప్పబడింది.

అస్నాత్వా నైవ భుంజీత
అజప్త్వాజ్య మహూయాచ।
పర్ణపృష్ఠే న భుంజీత
రాత్రౌ దీపం వినా తథా॥ (పరాశరస్మృతి)

స్నానం చేయకుండా భుజించరాదు. జపము చేయకుండా హోమము చేయరాదు. ఆకు వెనుక భాగంలో ప్రసాదము మొదలగు వానిని తినరాదు. రాత్రులందు చీకటిలో దీపము లేకుండా తినవద్దు. (దీనివెనుక విజ్ఞానము గమనించండి)

వాపీ కూప తటాకాద్యైః

(మిగతా 31 వ పేజీలో)

# యజ్ఞాచార్యులకు అక్షరాంజలి

**- శ్రీమాన్ శ్రీ డా.పి.టి.జి.యస్.కిశోరస్వామి**



"శ్రీపాంచరాత్ర మహోదధి" "ఆగమ తంత్ర స్వతంత్ర" "ఆగమ ప్రవీణ" "ఆసేతు యజ్ఞాచార్య స్వామి" "ఉభయ వేదాంత ప్రవర్తకులు" శ్రీమాన్ శ్రీమద్వాధూల సముద్రాల రమాకాంతాచార్య స్వామి వారి సంగ్రహ వైభవం సాటిలేనిది.

నల్లగొండ జిల్లాలో చెరువు అన్నారం అనే గ్రామంలో ఉత్తమ శ్రీవైష్ణవ సంప్రదాయ కుటుంబంలో వేంచేసియున్న ఉభయ వేదాంత ప్రవర్తకులు శ్రీమాన్ సముద్రాల సీతారామాచార్య స్వామి- శ్రీమతి రంగనాయకమ్మ గార్ల పుణ్య దంపతులకి దైవప్రసాదంగా సింహ మాసంలో రోహిణీ నక్షత్రములో శ్రీమాన్ రమాకాంతాచార్య స్వామి వారు చక్కని తిరుమేనితో అవతరించినారు. వాధూలకుల తిలకుడిగా పేరుగాంచినారు. తెలంగాణ ప్రాంతములో సంస్కృత తర్క వ్యాకరణ కోవిదులు వేదాంతవర్ధినీ కళాశాల ప్రధానాచార్యులు శాస్త్ర విద్వన్మణిగా పేరుగాంచిన ఉభయ వేదాంత ప్రవర్తకులు శ్రీమాన్ కోయిల్ కందాడై అప్పన్ శఠకోప రామానుజాచార్య స్వామి మరియు ఉభయ వేదాంత విద్వాన్ శ్రీమాన్ ప్రతివాది భయంకరం వేదాంతాచార్య స్వామివార్ల వద్ద విద్యను అభ్యసించినారు. ఉభయ వేదాంత విద్వాన్ శ్రీమాన్ సంతానం గోపాలాచార్య స్వామి వారి వద్ద అపౌరుషయములైన వేద విద్యను అభ్యసించినారు. సింగరాయకొండ శ్రీ వేంకట రంగాచార్య స్వామి వారి పరంపరకు చెందిన ఉభయ వేదాంత విద్వాన్ శ్రీమాన్ వాధూల సముద్రాల శఠకోపాచార్య స్వామి వారి సన్నిధిలో శ్రీ పాంచరాత్రాగమ శాస్త్రాన్ని అధికరించినారు. వీరికి శ్రీ పాంచరాత్రాగమ శాస్త్రముపై గల పట్టుదలతో ఇంతింతై వటుడింతై.. అన్నట్లుగా యజ్ఞాచార్యులై ఎందరికో మార్గ నిర్దేశం చేసి పాంచరాత్ర భూషణులుగా కీర్తింపబడ్డారు. దేశ విదేశాలలో శతాధిక ప్రతిష్ఠాదులను, ఎన్నో ఉత్సవములను నిర్వహించిన ఆసేతు శీతాచల యజ్ఞాచార్యులు. ఉభయ వేదాంత విద్వాన్ శ్రీమాన్ చిలకమర్రి శ్రీనివాసాచార్య స్వామి వారితో గల గరిష్ఠ సంబంధంతో ఆంధ్రదేశములోనే కాక మహారాష్ట్ర కర్ణాటక తమిళనాడు మొదలైన ఇతర రాష్ట్రాలలోనూ అనేక దివ్య దేశాలలో ప్రతిష్ఠాత్మక మహోత్సవములను ఎన్నిటినో వైభవంగా నిర్వహించి సంప్రదాయ పెద్దల ద్వారా శతాధిక ప్రతిష్ఠాది మహోత్సవ నిర్వహణ చతుర్వరేణ్యులుగా ప్రశంసలను అందుకున్నారు.

సత్య సంకల్పులు జగదాచార్యులుగా ప్రసిద్ధి చెందిన శ్రీమత్ పరమహంస పరివ్రాజక ఆచార్యులు శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ పెద్ద జీయర్ స్వామి మరియు వేద విద్యాలయ వ్యవస్థాపకులు పరమహంస పరివ్రాజకాచార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వార్ల మనోభీష్టమై లోక క్షేమార్థం శ్రీరామ మహాక్రతువులను, వేద స్వాధ్యాయ జ్ఞాన యజ్ఞములను బ్రహ్మోత్సవములను మరియు అనేక దేవాలయముల ప్రతిష్ఠలను మన దేశములోనే కాక శ్రీలంక నేపాల్ దేశములలోనూ సత్ సంప్రదాయ బద్ధముగా నిర్వహించినారు. మన రాష్ట్రంలో హైదరాబాదులో అపోలో వనపర్తి మహబూబ్ నగర్, వట్టెం, సూర్యాపేట, వరంగల్లు , సిద్దిపేట, మొదలగు క్షేత్రములలో దేవాలయ ప్రతిష్ఠాది ఉత్సవములను నిర్వహించి ఎంతో మంది భక్తులకు ఆదరపాత్రమైనారు. జగదాచార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి మార్గదర్శనంలో కాకతీయ సిమెంట్స్ అధినేత శ్రీమాన్ పి వెంకటేశ్వర్లుగారు స్థాపించిన శ్రీ పాంచరాత్రాగమ కళాశాల భారతీయ తత్వ కళాశాల లో ప్రధానోపాధ్యాయులుగా ఉండి ఎందరో ఔత్సాహికులైన విద్యార్థులకు చక్కని క్రమశిక్షణ ఇచ్చి యజ్ఞాచార్యులుగా తీర్చిదిద్దినారు. విద్యార్థులు ఏమైనా చిన్న చిన్న తప్పులు చేస్తే చిరునవ్వుతో సరిదిద్దే వైనం ఎంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి వారు ఏర్పాట్లు చేసిన శ్రీపాంచరాత్ర నిపుణ సంఘములో తమిళనాడులోని శ్రీ వైకుంఠమునకు చెందిన ఉభయ వేదాంత విద్వాన్ శ్రీమాన్ రంగభట్టర్ స్వామి వారితో సహచర సభ్యులుగా ఉండి ఉత్సవాది ప్రయోగ గ్రంథ ప్రకాశము చేయడంలో చక్కని చిరునవ్వుతో సహకారమందించి విద్యార్థులందరికీ సత్సంప్రదాయ

మార్గదర్శకులైన శాస్త్రరత్నాకరులు ,

మహా మహోపాధ్యాయులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, ఉభయ వేదాంత విద్వాంసులు శ్రీమాన్ శ్రీరంగం నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాస రఘునాథా చార్య స్వామి వారు వరంగల్లులో స్థాపించిన శ్రీపాంచరాత్రాగమ పాఠశాలకు సలహాదారునిగా ఎనలేని సేవల నందించినారు. నేపాల్ దేశంలో నిర్వహించిన వివిధ మహాయజ్ఞ నిర్వహణ సందర్భముగా గజారోహణ సన్మానమును పొందినారు. వీరి విజ్ఞానమునకు మహారాష్ట్ర లోని సోలాపూర్ లో సత్యసంకల్పులు అపర రామానుజులు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ పెద్ద జీయర్ స్వామి వారి కరకమలముల ద్వారా "శ్రీపాంచరాత్ర ప్రవీణ" అనే బిరుదును పొందినారు. శ్రీభాష్యకార సిద్ధాంత పీఠము పక్షాన "ఆగమ సార్వభౌమ" "పాంచరాత్ర మహోదధి" "సర్వతంత్ర స్వతంత్ర" అనే బిరుదులను పొందినారు. శ్రీ శ్రీ త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామి వారి శ్రీహస్తముల మీదుగా శ్రీగోపాల దేశిక విశిష్ట పురస్కారములు మరియు.

శాస్త్ర రత్నాకరులు కవిశాబ్ధిక కేసరి మహా మహోపాధ్యాయులు అపర వరవర మునీంద్రులు ఉభయ వేదాంత విద్వాంసులు శ్రీమాన్ శ్రీరంగం నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాస రఘునాథాచార్య స్వామి వారి దివ్య శ్రీహస్తముల ద్వారా "శ్రీరఘునాథ దేశిక విశిష్ట పురస్కారము" ను పొందినారు. ఇలా ఇంకా ఎన్నెన్నో సన్మానములను బిరుదులను అందుకున్నారు. ఇవి అన్ని వారు నిర్వహించిన వైదిక సత్ సంప్రదాయ కార్యక్రమాల దక్షతకు నిలువెత్తు నిదర్శనాలు. శ్రీమాన్ సముద్రాల రమాకాంతాచార్య స్వామి వారు వారి పవిత్రమైన జీవితాన్ని నెయ్యిగా చేసి ప్రేమ అనే వత్తులు వేసి వారిలో దాగివున్న శ్రీపాంచరాత్ర శాస్త్రమనే దీపాన్ని ఎందరో శిష్యుల హృదయాలలో వెలిగించినారు ఎప్పుడూ భగవత్ భాగవత ఆళ్వారాచార్యుల కైంకర్యమే మనకు ప్రధానం అని, వారు చక్కగా అనుష్టించి మన అందరిని అనుగ్రహిస్తున్నారు.

అంతటి మహానుభావులై న శ్రీమాన్ సముద్రాల రమాకాంతాచార్య స్వామి వారి దివ్య పద సన్నిధికి అక్షరాంజలిని ఘటిస్తున్నాము.

# ఋషి వాక్య ప్రబోధాలు

(29 వ పేజీ తరువాయి)

వాజపేయ శతై రపి।
గవాం కోటి ప్రదానేన
భూమి హర్తాం నశుద్ధ్యతి।। (శ్రీపరాశరస్మృతి)

బావులు, నూతులు, చెఱువులు ఎన్ని తవ్వించిననూ అనేక వాజపేయాది యాగములు చేసినా లేదా అనేక కోటి గో దానములు చేసినా అమాయకులైన ప్రజల భూమిని (కబ్జా) ఆక్రమించినవారి పాపము తొలగదు. తిరిగి పవిత్రుడు కాలేడు.

పూర్వజన్మ కృతం పాపం
నరకస్య పరిక్షయే।
బాధతే వ్యాధిరూపేణ
తస్య జప్యాదిభిః శమః।।

తాము పూర్వజన్మలలో చేసిన పాపముల ఫలితమే మనమనుభవించు రోగములకు కారణము. అవి ఔషధములు, మంత్రములు, జపతపాదుల ద్వారా శాంతించును. (ముందుగా ఔషధ సేవ తరువాత జపతపాదులు ఆచరించవలెను)


అహింసా సత్యవాదశ్చ
సత్యం శౌచం దయాక్షమా।
వర్ణానాం లింగినాం చైవ
సామాన్యో ధర్మ ఉచ్యతే।। (ధర్మశాస్త్రము)

అహింసావ్రతము, సత్యమును పలుకుట, శుచిగా ఉండుట, ఇతర ప్రాణులందు దయతో నుండుట, ఓర్పుగా మెలగుట ఇవి మానవులందరికీ సామాన్య ధర్మములు.

యద్దదాతి గయా క్షేత్రే
ప్రభాసే పుష్కరే తథా।
ప్రయాగే నైమిశారణ్యే
సర్వ మానంత్య మశ్నుతే।। (శంఖధర్మశాస్త్ర 15వ అ।।)

శ్రీమహావిష్ణువు పాదము గల గయాక్షేత్ర మందును అట్లే ప్రభాస తీర్థమందు గాని అనగా సోమతీర్థములో, పుష్కర తీర్థమందు ప్రయాగ త్రివేణిసంగమ మందు, నైమిశారణ్య మహాక్షేత్రమందుగాని ఏమాత్రము చిన్న దానము చేసినా అది అక్షయముగా మారి భగవత్ప్రీతికరమగును.

# ఉద్యోగం సద్యోగం



**శ్రీమాన్ శ్రీ కవి కృష్ణమాచార్యులు**

లోకంలో కొన్ని సామెతలని వింటుంటాం మనం. సామెత 'మెదడుకు మేత' లాంటిది. పెద్ద పెద్ద విషయాలను చిన్న చిన్న వాక్యాలుగా కూర్చి, సందేహాలను తీర్చి, సందేశంగా మార్చి అందంగా పెద్దల ద్వారా అందేవే సామెతలు జాతీయాలుకూడా.

అలాంటి వాటిలో సందేశాత్మకమైన ఒక సామెత.

"ఉద్యోగం సద్యోగం" ఏ పని చేయకుండా ఉండేవారిని చూసి "వాడికి ఉద్యోగం లేదు సద్యోగం లేదు" అంటారు. ఉద్యోగమంటే మన దృష్టిలో ఒక దగ్గర స్థిరంగా జాబ్ చేయడం. ఎటువంటి జాబ్ లేనివారిని చూస్తే మీరు ఉద్యోగం చేయడం లేదా? అని అడుగుతాం.

సంస్కృతంలో ఉద్యోగ మంటే కేవలం ఒక వృత్తి (జాబ్) అని అర్థం కాదు, ఉద్యోగమంటే ప్రయత్నం అని అర్థం. ఉద్యోగమంటే ఎప్పుడో ఎక్కడో ధనం కోసం చేసేది కాదు, ఇప్పుడే ఇక్కడే సాధనగా చేసేది. అలుపెరుగని ప్రయత్నానికి, నిరంతర సాధనకు ఉద్యోగమని పేరు. ఇలా అర్థం చేసుకుంటే నాకు ఉద్యోగం లేదనో, నన్ను ఉద్యోగం నుండి తీసేసారనో చెప్పడం మానేస్తాం.

సింహమైనా సరే వేటాడితేనే దానికి ఆహారం తప్పు, అది పడుకుంటే దాని నోట్లోకి జంతువులు వాటంతట అవ్వే ఆహారంగా దూరలేవు.

ఈ ప్రపంచంలో మనల్ని మనం తప్ప ఉద్యోగం నుండి తీసేసేవారు ఎవరూ లేరు. అనుకున్న లక్ష్యం చేరుటకు ప్రయత్నం లేకపోవడమే ఉద్యోగం చేయకపోవడం అని అర్థం.

"ఉద్యమే న హి సిద్ధ్యన్తి కార్యాణి న మనోరథైః

న హి సుప్తస్య సింహస్య ప్రవిశంతి ముఖే మృగాః" అనే శ్లోకం ఉద్యోగం (ప్రయత్నం) యొక్క గొప్పతనాన్ని తెలియజేస్తుంది. సింహమైనా సరే వేటాడితేనే దానికి ఆహారం తప్పు, అది పడుకుంటే దాని నోట్లోకి జంతువులు వాటంతట అవ్వే ఆహారంగా దూరలేవు. సింహ సదృశమైన శక్తి మనందరిలో ఉన్నా, కేవలం మనసులో అది చేయాలి, ఇది చేయాలి అని అనుకుంటే సరిపోదు, చేతల్లోనూ అది చూపించాలి.

అనుకున్న గమ్యం చేరాలంటే ఆరాటముంటే సరిపోదు. పోరాటముండాలి. ఉద్యోగానికే ప్రయత్నమని, పోరాటమని, సాధన అని ఎన్నో పేర్లు. కొంతమంది బద్ధకంతోనో, నిరాశతోనో, నిర్లక్ష్యంతోనో జీవిత లక్ష్యం చేరడానికి ప్రయత్నం చేయరు, అంటే ఉద్యోగం చేయరన్నమాట! అందుకే పెద్దలంటారు. "ఉద్యోగం లేకపోయినా సద్యోగం ఉండాలట". ఉద్యోగమంటే ప్రయత్నించుట అని తెలుసుకున్నాం!

మరి సద్యోగమంటే? సత్సంగమని, సత్పురుషుల సహవాసమని అర్థం. ఆరోగ్యం, ఆనందం కలగాలంటే మంచి నీరు తాగాలి, మంచి వారితో సాగాలి. మంచి నీరు శరీరంలోని మాలిన్యాన్ని తొలిగిస్తే, మంచి వారు (సత్పురుషులు) మనసులోని అజ్ఞానపు మాలిన్యాన్ని తొలగిస్తారు. మంచి వారితో కలిసుండటమే సద్యోగం. "సహజ వైష్ణవాచార వర్తనుల సహవాసమే మా సంధ్య" అని అంటారు అన్నమాచార్యులు.

సత్పురుషులైన శ్రీవైష్ణవుల సహవాసమే సంధ్యావందన మంత పవిత్రమైనదట. సత్ అంటే మంచివారితో అని, యోగం అంటే కూడి ఉండుట అని అర్థం. సత్సంగానికే, సద్యోగమని పేరు. లక్ష్యశుద్ధి కలిగిన సత్పురుషులతో కలిసుంటే మనలోని రజస్తమస్సులు తగ్గి సత్త్వ గుణం పెరుగుతుంది, తద్వారా వివేకం, విచక్షణ ఏర్పడి నిరంతర సాధకులుగా మారుతాం! లక్ష్యాన్ని చేరుతాం!

"సద్యః ఫలాన్నిచ్చే యోగమే సద్యోగం", జీవితం సద్వినియోగం కావాలంటే ఉండాలి సద్యోగం!


ఉద్యోగం లేకపోయినా కావాల్సింది సద్యోగం.సద్యోగం మనను అజ్ఞానం నుండి విడిపిస్తుంది, ఉద్యోగంవైపు విజ్ఞానంతో నడిపిస్తుంది. ★

# మొగిలి పాలెం లక్ష్మీకేశవాలయం






కరీంనగర్ సమీపంలో గల దేవాలయాలలో మొగిలిపాలెం కేశవాద్రిపై వెలసిన లక్ష్మీ కేశవ స్వామి దేవాలయం మహిమాన్వితమైనది. అత్యంత పురాతనమైన దేవాలయం. కనుక ఎందరో భక్తులు ఇలవేల్పుగా కొలుస్తూ భక్తితో దర్శిస్తూ ఉత్సవకైంకర్యములలో పాల్గొంటున్నారు. సత్ ఫలాలను పొందుతున్నారు. చక్కని ప్రకృతి అందాలతో నిండిన పరిసరాలలో ఆహ్లాదంగా ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందుతున్నారు. అన్య మతస్థుల దాడులలో ఎన్నో దేవాలయాలు విధ్వంసం అయినాయి. కాని మరెన్నో దేవాలయాలను అర్చామూర్తులను మన పెద్దవారు కాపాడుకొని పునర్వైభవాన్ని తీసుకొని వచ్చారు. ఈ దేవాలయ స్థల చరిత్రలోనూ ఆశ్చర్యకర కథనాలు ఉన్నాయి. 120 సంవత్సరాల క్రితం స్థానికంగా ఊరి పెద్దలైన నర్సింహారెడ్డిగారు ఒక బావి తవ్విస్తున్నప్పుడు. కొన్ని విగ్రహాలు బయటపడ్డాయి. వాటిని స్వప్నంలో భగవంతుడు ఆజ్ఞాపించిన రీతిలో గుట్టపైన గల ఒక గుహలో వారు ప్రతిష్ఠించారు. వైష్ణవ అర్చకులను ఏర్పాటు చేసి ధూపదీప నైవేద్యముల వ్యవస్థ నేర్పరచారు. వంశపారంపర్యంగా మూడు నాల్గు తరాలుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గతంలో కృష్ణారెడ్డిగారి నిర్వహణలో 2006 లో జరిగిన పునః ప్రతిష్ఠలో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారు, నంబి వేణుగోపాలాచార్యస్వామి వారు పాల్గొన్నారు. అనేక మంది పెద్దలు ఈ దేవాలయాన్ని దర్శించారు.



ఈ దేవాలయ చరిత్రకు సంబంధించి ఒక ప్రాచీన గ్రంథం కూడా ఉందట! అందులో స్వామి మూర్తి వర్ణనంలో, గోటిపై అందమైన గీతలు ఉన్నాయని 'పంచ పాద ప్రమాణం వా' అని స్వామి మూర్తి 5 అడుగుల పైన ఎత్తుగా ఉంటుందని ఆ మూర్తి సౌందర్యం వర్ణించబడిందట! దాన్ని ఆధారంగా చేసుకొని పెద్దల పర్యవేక్షణలో తూర్పు ద్వారాన్ని ఏర్పాటు చేస్తుండగా గ్రంథంలో వర్ణించిన రీతిలో 5అడుగుల పైన ఎత్తుతో గోటిపై చారికలతో అందమైన స్వరూపం గల మూర్తి బయట పడిందట! ఆ స్వామిని ప్రతిష్ఠించి ఆరాధనలు జరిపించారు. పూర్వపు పెద్దలు భగవన్ మూర్తులను ఆవిధంగా దుండగుల కంట పడకుండా నిక్షిప్తం చేసి ఉండ వచ్చునవి పెద్దలు భావిస్తారు.

ఆశ్చర్యకరమైన భగవంతుని లీలలకు భక్తి విశ్వాసాలతో ఆకుటుంబీకులు నేటికీ దేవాలయ నిర్వహణ బాధ్యతను వహిస్తున్నారు.

నిత్య ఆరాధనలతో పాటుగా ప్రతి సంవత్సరం మాఘ మాసం జరిగే బ్రహ్మోత్సవాలు, మార్గళి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహింపబడతాయి.

ప్రస్తుతం మాడభూషి సంపత్కుమారాచార్యులు అర్చక సేవలు కొనసాగిస్తున్నారు. (దేవాలయ నిర్వాహకులు పిన్నింటి నర్సింహారెడ్డిగారి నుండి సేకరణ ) ★

# కీర్తి మూర్తులు శ్రీమాన్ డింగరి లక్ష్మీనారాయణాచార్యులు

### గ్రామస్థుల అభిప్రాయాలు

డింగరి లక్ష్మీనారాయణాచార్యులు ప్రజల అందరి మన్ననలను పొందియున్నారు.



గ్రామ ప్రజలందరితో కలుపు గోలుగా ఉంటూ, వావీ వరుసలతో పిలిచేవారు. నన్ను ఆప్యాయతగా చెల్లెమ్మా అని పిలిచేవారు.

ఈ ప్రాంత భక్త సమాజానికి కరీంనగర్ జిల్లాలో ఎక్కడ లేని విధంగా గోదూరు గ్రామంలో 'శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం' నిర్మించారు.మా గ్రామంలో ప్రతి సంవత్సరము ఉగాది రోజున పురాతన దేవాలయం అయిన శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో నూతన పంచాంగ శ్రవణము ప్రజలకు వినిపించేవారు. మేము మంచి పండితున్ని కోల్పోయామని, చింతిస్తున్నాము

– శ్రీమతి జాజాల భీమేశ్వరి జగన్ రావు,
ఎంపీపీ, ఇబ్రహీంపట్నం

అయ్యగారు తరతరాలు గుర్తుండి పోయేలా మహత్తర కార్యం దేవాలయ నిర్మాణం చేశారు. వారు ఎక్కడ నిలబడినా



జనం వారు చెప్పే మంచి మాటలు వినటానికి చుట్టూ మూగేవారు. వారు చెప్పే మంచి మాటలకు ముగ్ధులయే వారు. ధర్మం, జ్ఞానం, వినయం, విధేయత, శాస్త్రం . ఇలా ఎన్నో విషయాలు చెప్పేవారు. చిన్నపెద్ద అందరినీ ఆప్యాయంగా పలకరించేవారు. వారి తల్లిదండ్రులు గోధూరు గ్రామానికి ప్రసాదించిన వరం వారు. వారు వెళ్ళి పోవటం మాకు చాలా బాధాకరం.

– అనంతయ్య, గోధూరు

గోధూరు గ్రామానికి లక్ష్మీనారాయణా చార్యులు 20 సంవత్సరాలు సర్పంచిగా



ఉన్నారు. గ్రామానికి స్కూలు కొరకు కోటి రు.లు విలువైన ఎకరా స్వంత స్థలాన్ని ఇచ్చినారు. చుట్టు పక్కల గ్రామాల వారు ఈ స్కూల్లో చదువుకొని ఉన్నత స్థాయిలలో ఉన్నారు. గ్రామ అభివృద్ధికి ఎంతో పాటు పడ్డారు వారు గ్రామానికెంతో సేవ చేశారు. – సోమ ప్రభాకర్, (సర్పంచ్)

అయ్యగారు ఏనాడు కుల



వివక్షత చూపించలేదు. వారితో మాకు ఉన్నది గురు శిష్యుల సంబంధం. విష్ణు సహస్ర నామ పారాయణాలు వారానికి ఒకరి ఇంట్లో చేయించే వారు. తిరుప్పావై పాశురాలు కూడా చదివించే వారు. ఎన్నో విషయాలు నేర్పించే వారు. అయ్యగారిలాంటి వారిని మరొకరిని చూడము. వారు లేరనే వార్తను జీర్ణించు కోలేక పోతున్నాము – తోట రంజిత్

మా గోధూరు అయ్యగారు



వెంకటేశ్వర్ల గుడి కావాలని ఎంత ఆరాట పడ్డాడో మాకు తెలుసు. దేవుడు, భక్తి,పూజలు అయ్యగారి తోనే మేము నేర్చుకున్నాము, వారు మాకు తండ్రిలాంటివారు వారు ఎంతో మంచివారు. వారితోనే మాకు ధైర్యం. కానీ ఇప్పుడు మాకు వారు లేరు. – గోపు లలిత

# బాలవిజ్ఞానం

# అవ్వ మాట

శ్రీమతి విజయ కందాళ

అనగా అనగా రామాపురం అనే ఊరిలో మల్లన్న అనే ఒక రైతు ఉండేవాడు. అతనికి ఒక ఎకరం పొలం ఉండేది. దాన్ని దున్నుకొని జీవితం సాగించేవాడు. ఒకసారి ఆ పొలానికి ఎరువుల కోసం చీకటితోనే లేచి పట్నానికి బయలుదేరాడు. బయలుదేరేటప్పుడు అతని అవ్వ ఒక మూటలో చద్ది అన్నం దారిలో తినడానికి ఇచ్చింది. అయితే ఏదీ నీవు ఒక్కడివే తినకు. ఎవరికైనా కొంత పెట్టి నువ్వు తిను. ఎవరూ లేకపోతే కనీసం ఏ జంతువుకు చివరికి చీమకు అయినా సరే కాస్త పెట్టిన తర్వాతే నువ్వు తినాలి అని చెప్పింది. మల్లన్న బండిలో వెళ్లి పట్నంలో ఎరువులు కొని తిరిగి ఊరికి బయలుదేరాడు. దారిలో అడవి ద్వారా అతను ప్రయాణం చేయవలసి వచ్చింది. ఆ పక్కనే నది పారుతుంది. నదిని చూసేటప్పటికి అతనికి దాహం వేసింది. ఆ వెంటనే ఆకలి కూడా వేసింది. బండిని నిలిపి ఎద్దులకు మొదట గడ్డి వేశాడు. తర్వాత చద్ది మూటను బయటికి తీశాడు. ఎవరికైనా కాస్తంతైనా పెట్టి తినమని అవ్వ చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. ఎవరూ కనిపించలేదు. పక్కనే ఉండే చెట్టు దగ్గర ఒక చీమల పుట్ట కనిపించింది. తన దగ్గర ఉన్న దాంట్లో కొంచెం అన్నము, దారిలో తినడానికి ఇచ్చిన కారప్పూస తీసి ఆ పుట్ట దగ్గర ఒక ఆకు మీద పెట్టాడు. అలాగే మరికొంత అన్నం పక్కనే ఉన్న ఒక చిన్న రాయి పైన ఉంచాడు. మిగిలింది తాను తినేసి నీళ్లు తాగి, చెట్టు నీడన కాసేపు విశ్రాంతి తీసుకున్నాడు. అయితే ఆ రాతి మీద అన్నం చూసిన కొన్ని కోతులు, కాకులు వచ్చి తినడం, కొన్ని మెతుకులను చీమల నోట కరుచుకొని వెళ్లడం ఇదంతా గమనిస్తూ ఆశ్చర్యపోయాడు. కాసేపటికే మల్లన్నకు నిద్ర వచ్చింది.

అతనికి గట్టిగట్టిగా అరుస్తున్న కాకులు శబ్దం వినిపించింది మెలకువ వచ్చి చూసేటప్పటికి పుట్ట దగ్గర ఉండేటటువంటి త్రాచు పాముని పొడుస్తున్న కాకులు, చుట్టుముట్టి కుడుతున్న చీమల గుంపులు, పాముతో పోరాడుతున్న కోతులు కనిపించాయి. కృతజ్ఞతతో ఆ నోరులేని మూగజీవులు ఈరోజు తన ప్రాణాన్ని ఎలా కాపాడాయో చూసి ఆశ్చర్యం, ఆనందం కలిగాయి. నోరులేని ప్రాణులే ఇంత సాయం



చేయగా వివేకం, విచక్షణ జ్ఞానం ఉన్న మానవులు ఒకరికొకరు తప్పక సాయం చేసుకొని తీరాల్సిందే అనుకున్నాడు. తన అవ్వ చెప్పిన చిన్నమాటలో ఎంత అర్థం దాగి ఉందో అనుకుంటూ మల్లన్న అవ్వకు జరిగిన విషయాల్ని చెప్పడానికి త్వరగా బండి తోలుకొని ఇంటికి వచ్చేసాడు.

ఇంటికి చేరాక జరిగిన విషయాలన్నీ వివరంగా అవ్వకు చెప్పాడు. తాను చెప్పిన మాట ప్రకారం నడుచుకున్నందుకు అవ్వ చాలా సంతోషించింది. ఎప్పుడూ కూడా నలుగురికి సహాయం చేసే ఆలోచనని వదిలి పెట్టవద్దని మనసులో నిశ్చయించుకున్నాడు. అప్పటినుంచి నలుగురి కష్ట సుఖాల్లో పాలు పంచుకుని మంచి పేరు తెచ్చుకున్నాడు మల్లన్న. దానితో అందరూ అతన్ని చాలా అభిమానంతో, గౌరవంతో చూడసాగారు. మనం కూడా కేవలం మన గురించే కాకుండా మన చుట్టుపక్కల ఉండేటటువంటి ఇతర ప్రాణులను గురించి కూడా ఆలోచిస్తే ఈ ప్రకృతి ఎంతో అందంగా తయారవుతుంది. మన ఇంటి ముందర కానీ డాబా పైన కానీ ఒక చిన్న గిన్నెలో కానీ కాసిని నీళ్లు పోసి పెట్టామనుకోండి అవి దాహం తీర్చుకుంటాయి. మనకి ఒక మంచి పని చేసాము అన్న తృప్తి కలుగుతుంది కదా! మీరు కూడా ఆలోచించండి ఇకమీదట మీకు సాధ్యమైన దాంట్లో ఎదుటి వాళ్ళకి కష్టం వచ్చినప్పుడు తోడు నిలబడడం అలవాటు చేసుకోండి. ★

**PRAPATTI SRISANNIDHANAM** Telugu Monthly **OCT 2024** **RNI NO : TELTEL12303**

# శ్రీసన్నిధి పదకేళి 8

## అడ్డం

1.దాశరథి శతక రచయిత (6)

2.అత్రి మహాముని భార్య (6)

3.తిరుమల శ్రీనివాసునికి పుష్ప కైంకర్యము చేసిన వారు (రామానుజసుధామాధురి)(5)

7.జ్ఞానమనే వెలుగు చూపే లక్ష్మి (4)

## నిలువు

4. గణాధిపతి ఎవరు? (4)

5. హిరణ్యాక్షసంహార అవతారం(7)

6.శ్రీమహావిష్ణువుకు సర్వసైన్యాధ్యక్షుడు (5)

8. విపత్కర పరిస్థితుల నుండి కాపాడే లక్ష్మి(4)


9. రామలక్ష్మణులను గంగానది ఎవరు దాటించారు (3)

10.గజరాజు కైంకర్యముల నందుకునే లక్ష్మి (4)

11.శ్లోకత్రయము (2)

12.పాండవసేన కౌరవసేన కంటే? (3)

13.తెలుసుకోవలసినవి (శీర్షిక) 2)




## శ్రీసన్నిధి పదకేళి (7) సమాధానాలు

విజేతలకు అక్టోబర్ నెల పత్రిక పంపించడం జరుగుతుంది

1.శతరూపాదేవి, 2.రామలక్ష్మణులు, 3.పద్మనాభుడు 4.లక్ష్మీదేవి, 5.ఆదిత్యహృదయము, 6. శ్రీకృష్ణాష్టమి, 7. స్తోత్రరత్నం, 8. ఐరావతం, 9.వ్యాసుడు, 10.అంజనాద్రి, 11.నెయ్యి, 12.గాంధారి, 13.అగ్నిం.

సరియైన సమాధానాలు పంపినవారు

శ్రీమతి లక్ష్మీప్రసన్న, కాకినాడ, సి.హెచ్. కరుణాకర్ రావు, హైదరాబాద్,

## పదకేళిలో పాల్గొనండి! ఉచిత పత్రిక అందుకోండి!!

ఈ పదకేళిలో సరియైన సమాధానాలు వ్రాసి సరియైన జవాబులు **9502583323** వాట్సప్ ద్వారా పంపండి.

Printed & Edited and Published by DINGIRI SRINIVASA MURTHY on behalf of SRISANNIDHANAM CHARITABLE TRUST and Published at H.No 10-2-225, Vidhyanagar, Karimnagar, Telangana - 505 001
Editor DINGIRI SRINIVASA MURTHY, RNI Title No TELTEL12303, Cell No : 9502583323, Land line No 0878-2253323
Email Id prapatti.srisannidhanam9@gmail.com.